# నేటి తరానికి
# దేవుని సందేశం

–జి. ఆర్. క్రో

గ్రేస్ మినిస్ట్రీస్

NETI THARANIKI
DEVUNI SANDESAM

Copyright © 2016 Grace Ministries

All rights reserved
Published by Grace Ministries,

Visit our Website at www.graceministriesindia.com

## లోపల సందేశాలు


1. ఆయనను మాత్రమే సేవించుట! పేజీ నెం. *5*

2. ప్రభువైన క్రీస్తు పేజీ నెం. *19*

3. విశ్వాస వ్యాయామం పేజీ నెం. *33*

4. క్రీస్తు పాఠశాల పేజీ నెం. *41*

5. లోక సమృద్ధి పేజీ నెం. *53*

6. ఒకే ఒక్క సత్య సంఘం పేజీ నెం. *65*

7. మహా శ్రమలు పేజీ నెం. *75*



# ఆయనను మాత్రమే సేవించుట!

"ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను" (మత్తయి 4:10). బైబిల్ అంతటిలో ఉన్న గొప్ప ఆజ్ఞలలో ఇది ఒకటి. క్రీస్తునందు విశ్వాసం ఉంచిన మనం తప్పక ఆయనను సేవించాలి, లేదంటే అవిధేయులంగా

ఉంటాము. అంటే ప్రతి ఒక్క విశ్వాసి కూడా ఒక పాస్టర్‌గానో, ఒక సువార్తికునిగానో లేక ఒక మిషనరీగానో తయారవ్వాలని కాదుగానీ ప్రతి విశ్వాసి తప్పక క్రీస్తుని ప్రభువుగా అంగీకరించి ఆయన అధికారానికి ఒప్పుకొని ఆయన తప్ప మరిదేనినైనా, మరే వ్యక్తినైనా మన జీవితాలని ఏలుబడి చేయడానికి అనుమతించరాదని దీనర్థం. దేవుడిచ్చిన ఈ ఆజ్ఞ చాలా సాధారణమైనది. దీనిని అర్థం చేసుకోవడం చాలా సులభమైనదే గాని లోబడటం అంత సులభమైనది కాదు. ఈ ఆజ్ఞకు నీవు లోబడకుండా చేయడానికి ప్రయత్నించే చాలా బలమైన శక్తులు ఈ లోకంలో ఉన్నాయి. దేవుని ఆజ్ఞలకు లోబడనొల్లని గొప్ప పాపపు శక్తి నీ స్వభావంలోనే ఉంది. అది నిన్ను తొట్రిల్లచేసి, నీవు తప్పిపోయేలా నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నది. మరియు నిన్ను అడ్డుకొని నీతో పోరాడడానికి సాతాను సిద్ధంగా ఉన్నాడు. వాడు తన గొప్ప తెలివితేటలను మరియు యుక్తికరమైన పథకాలన్నింటిని ఉపయోగించి నీవు దేవుని ఆజ్ఞలకు లోబడకుండేలా చేస్తాడు. క్లుప్తంగా చెప్పాలంటే నీ ఆత్మీయ జీవితంపై ముగ్గురు బలమైన శక్తులు యుద్ధం చేస్తున్నారన్నమాట. అవి పతనమైన లోకము, పడిపోయిన దేవదూతయైన సాతాను మరియు మనలో ఉన్న పతనమైన స్వభావం. మత్తయి 4:1–11 వచనాల్లో సాతాను సాక్షాత్తు ప్రభువైన యేసునే పడగొట్టాలని గురిచూచి దాడి

చేయడం మనం చూస్తాం. మరి ఈ విషయంలో నీపై దాడి చేయడని నీవనుకొనుచున్నావా? అలా యోచించి అవివేకివి కాకు.

భూమి మీదనున్న ప్రతివ్యక్తి ఎవరో ఒకరిని లేక ఏదో ఒకదానిని బానిసగా సేవిస్తున్నారు. స్వేచ్ఛ అనేది వట్టి భ్రమ మాత్రమే! తప్పిపోయిన కుమారునివలె నిర్బంధాలన్నింటిని త్రోసివేసి తమకు నచ్చినదానిని చేసేందుకు స్వేచ్ఛని కోరేవారే నిజంగా మరింతగా బానిసలౌతారు. యోహాను 8:34లో "పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని" యేసు చెప్పారు. ఈ భూమిపైనున్న ప్రతి మనిషి పాపం చేసినవాడే గనుక ప్రతి మనిషి పాపమునకు బానిసై క్రీస్తు అతనిని విడిపించేవరకు బానిసగానే ఉండిపోతాడు. యోహాను 8:36లో కుమారుడు మిమ్మును స్వతంత్రులనుగా చేసిన యెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు" అని కూడా ప్రభువు చెప్పారు. ఈ స్వతంత్రత దేని నుండి? పాప పర్యవసానం నుండి. ఈ స్వతంత్రత దేని కొరకు? ఆయనను సేవించుట కొరకు. ఆయన మనలను స్వతంత్రులుగా చేసినప్పుడు చివరికి మనం ఆయనను సేవించకుండా ఉండటానికి కూడా స్వేచ్ఛగల స్వతంత్రులమౌతాం. కానీ అప్పుడు మనం సేవించకుండా ఉండలేము. ఆయన మనలను విడిపించాడు గనుక ఆయనను ప్రేమిస్తాము, సేవిస్తాము. మరియు మనము

ఆయనకు చేసే సేవ ఇష్టపూర్వకంగాను, సంతోషంగానూ ఉంటుంది. మరియు యేసు కూడా తనను సేవించకుండా మనలను అడ్డగిస్తున్న ప్రతివిధమైన శక్తి లేక వ్యక్తి లేక ప్రభావం నుండి విడిపించ ఆసక్తి కలిగియున్నాడు. మనము మన హృదయాంతరంగాల్లో ఇట్టి విడుదలను కలిగియున్నప్పుడు ఆయనను నిరభ్యంతరంగాను, స్వేచ్ఛగాను, సంతోషంగాను సేవించగలం. అందువలన ప్రజలు నిజదేవున్ని మాత్రమే ఎల్లకాలము సేవించాలని నొక్కి చెప్పుచున్నారు.

ప్రజలు సాధారణంగా ఇతర దేవుళ్లను, ఇతర విషయాలను సేవిస్తారని ఆయనకు తెలుసు. ఇలాంటి వాటినెన్నిటినో గూర్చి బైబిల్ చెబుతున్నది గాని వాటినన్నిటిని గూర్చి చర్చించడానికి సమయం లేనందున వాటిలో కొన్నింటిని మీకు జ్ఞాపకం చేస్తున్నాము. వెండి, బంగారం, కర్ర, రాళ్లు మొదలగు వాటితో చేసిన విగ్రహ రూపాల్లో ప్రజలు ఆరాధించే అన్య దేవుళ్లను గూర్చిన విషయం మనకు తేట తెల్లమైంది. ఇశ్రాయేలీయులు ఇటువంటి దేవుళ్లను మ్రొక్కకూడదు, సేవించకూడదనియు, వారు ఈ విశ్వానికి సృష్టికర్తయైన దేవునినే హత్తుకొని యుండాలనియు పదే పదే ఆజ్ఞాపించబడ్డారు. గనుక దీనిని గూర్చి కూడా వివరింపబోవడం లేదు. గాని భౌతిక విగ్రహాలతో రూపించబడక హృదయాలలో ఉంటూ ఒక రూపంగానీ, ఆకారంగానీ లేకుండానే ఉండే అంత్యంత

ప్రభావమైన ఇతర దేవుళ్లను గూర్చి చెబుతాను. హృదయంలో దాగియుండే విగ్రహాల మూలంగానే మనుష్యులు భౌతికమైన విగ్రహాలను తయారుచేస్తారు. మరియు ఈ హృదయపు దేవుళ్లు పతనమైన నీ స్వభావంలో దాగియుండి తమను నీవు సేవించేలా నీ అంతరంగంలో పోరాడుతుంటారు. ఈ వాస్తవాన్ని నీవు నమ్మకపోతే పొరబడుతున్నావు. ఇంకా నీవు నీ పతనమైన స్వభావం గూర్చి తెలుసుకోలేదన్నమాట.

ప్రపంచమంతటా ప్రజలు సాధారణంగా సేవించే ఒక తప్పుడు దేవుడు ఉన్నాడు అది “మతమనే దేవుడు”. కోట్ల కొలది ప్రజలు సేవించేది దేవుడ్ని కాదు, తమ మతాన్నే! ఒక వాస్తవమైన బానిస తన యజమాని బంధకములలో ఉన్నంత వాస్తవంగా వీరు తమ మతపు బంధకాల్లో ఉన్నారు. వారు తమ మతం తమను చేయమన్న దేనినైనా సరే ఆలోచించకుండా, ఎదురు చెప్పకుండా ఇతర సాధ్యాసాధ్యాలను అంచనా వేయకుండానే చేసేస్తారు. దీని గూర్చి సమయం తీసుకొని వివరంగా చెప్పాలని ఉంది కానీ ప్రస్తుతానికి మనుష్యులు నిర్మించుకొన్న మరికొన్ని ఇతర దేవుళ్లని గూర్చి చెబుతాను.

పౌలు ఇటువంటి ఒక దేవుని గూర్చి రోమా 16:17,18 వచనాల్లో చెప్పాడు. మరలా ఫిలిప్పీ 3:19లో కూడా చెప్పాడు (ఆ వాక్యాలను చదవండి). కాబట్టి కొందరు

క్రైస్తవులకు తమ కడుపే తమ దేవుడు మరియు తమ ప్రభువు అన్నమాట. వారికి తమ కోరిక తీరా తిన్నా తృప్తి కలుగదు. వారికి ఎప్పుడూ మరెక్కువ ఆహారం కావాలనే చింత తప్పితే జీవితంలోని ఇతర మంచి విషయాలను గూర్చి పట్టింపే ఉండదు. కాబట్టి వారి కడుపనే దేవుడు ఏమి ఆజ్ఞాపిస్తే దానికి వెంటనే లోబడ్డానికి త్వరపడతారు. వారికి పరసంబంధమైన విషయాలు, బహుమానాలు పట్ల పెద్ద ఆసక్తి ఉండదు. వారికి కావలసిందల్లా ఆ సమయానికి వారి కడుపు కోరిన తృప్తే! బైబిల్‌లో ఈ కడుపు సేవను గూర్చిన ఒక విచారకరమైన ఉదాహరణ ఏశావు.

ఈ కడుపు దేవునికి శరీరేచ్ఛ దేవుడు అనేవాడు భాగస్వామి. నిజానికితడు చాలా శక్తివంతమైన దేవుడు. రాజైన సౌలు వేలకొలదియు, దావీదు పదివేల కొలదియు శత్రువులను హతమార్చిరి గాని, ఈ శరీరేచ్ఛ దేవుడు కోటానుకోట్ల ప్రజలను హతమారుస్తున్నాడు. మరియు భూప్రజలలో అధికశాతం మందిని తన సేవలోనే బంధించాడు. శరీరేచ్ఛ అనగా నా భావం తప్పయిన లైంగిక వాంఛ అని. ఈ శరీరేచ్ఛ దేవుడు తన బంధితులను "వెళ్లి మురికి గుంటలో పడి దొర్లండి!" అని ఆజ్ఞాపించగా పాపం ఆ బానిసలు, "ఈ రోజు ఏ మురికి గుంట ప్రభువా" అని అడుగుతారు. అప్పుడు వాడు "ఏ గుంట అయినా పర్వాలేదు, దైవభక్తిని అపవిత్రం చెయ్యండి.

నిజ దేవుని వాక్యాని నిర్లక్ష్యం చెయ్యండి, మనస్సాక్షి గొంతుని నులిమెయ్యండి. బుద్ధిహీనులుగా ప్రవర్తించి మీమీదకి మీరే అవమానము, రోగము చివరకు మరణము అనే అపాయాన్ని తెచ్చుకోండి" అని చెప్తాడు. దానికి ఆ శరీరేచ్ఛ బానిసలు "చిత్తం ప్రభువా" అని వినయంగా జవాబు ఇస్తారు. 50 సంవత్సరాల పాటు నేను ఇండియాలో సేవ చేసాను. అనేకమంది క్రైస్తవ నాయకులు ఈ బలమైన శరీరేచ్ఛ ముందు లొంగిపోయి తమతోపాటు తమ పరిచర్యలు నాశనం చేసుకోవడం నేను కళ్లారా చూసాను. నీవు కూడా వారిలో ఒకడివి కాకుండా ఉండాలంటే "యవ్వనేచ్ఛల నుండి పారిపొమ్ము" (2 తిమోతి 2:22) అని పౌలు చెప్పిన సలహా చొప్పున నడుచుకొనుము.

ఇక ప్రజలు తమ హృదయాల్లో సేవించే మరొక విగ్రహము "గర్వమనే ప్రభువు". ఇతని కవల సోదరుడు అహంభావ ప్రభువు. వీరిద్దరు తమను సేవించేవారితో (బానిసలతో) "భూమి మీదగాని పరలోకములోగాని ఎవనిముందు నీ మెడ వంచకు! బలహీనుడవుగా, సాత్వికుడుగా, దీనుడవుగా ఉండబోకు. ప్రజలను నీ చుట్టూ త్రిప్పుకోవడానికి ఇదే మార్గము. మొండిగా, కఠినుడివిగా ఉండు. నిన్ను నీవు గొప్పవానిగా భావించుకో! నీవు ఏమైయున్నావో, నీవు ఏమి చెయ్యగలవో ఆ విషయాలను బట్టి గర్వించు. నీ శరీర

రంగునుబట్టి, నీ కులమును బట్టి, నీ ఆస్తినిబట్టి గర్వించు. పేదలను, దీనులను కించపరచి చూడు, వారు నీకు ఏ మేలును చేయలేరు. ఇతరులపై పెత్తనం సంపాదించు" అని చెప్తారు. పాపం, ఆ బుద్ధిహీనపు బానిసలు వారి మాటలకు లోబడి ఏకైక నిజదేవుని ఎదుట మెడ వంచడానికి అయిష్టత చూపి, గర్వమనే ప్రభువుకు తలవంచి వానికి తమ జీవితాలను అప్పగించేస్తారు. వారు మనుష్యుల మెప్పును, ప్రజల దృష్టిలో హెచ్చింపబడటాన్ని కోరుకుంటారు.

ఇప్పుడు మరొక అపారశక్తివంతమైన దేవున్ని చూపుతాను. లోకంలో బహుకొద్దిమంది మాత్రమే వాడి సేవ నుండి తప్పించుకొంటారు. వాడి పేరు "ధన దేవుడు". ఈ ధన దేవుడు తన సేవకులతో "నన్నాశ్రయించండి, మీరు నన్ను నిజ దేవుడ్ని ఒకే సమయంలో సేవించగలరు. మీకు ఏ సమస్య ఉండదు అయితే నేను ఒక్కోసారి కొన్ని హానికరంకాని అబద్దాలు చెప్పమని, చిన్న చిన్న మోసాలు చేయమని, ప్రభుత్వానికి నిన్ను గూర్చి, నీ ఆస్తిపాస్తులను గూర్చి తప్పుడు సమాచారం ఇవ్వమని, నీకు మంచి లాభం కలగడం కోసం ఇతరుల బలహీనతలు వాడుకొమ్మని, మిమ్మల్ని అడుగుతుంటాను (డిమాండ్ చేస్తుంటాను). వీటి విషయం విచారించకండి, మీ భక్తికి ఏమీ ఢోకా ఉండదు, చివరికి లభించే ప్రతిఫలాన్ని చూడండి— బ్యాంక్‌లో విస్తారమైన డబ్బు, ఇళ్లు,

ఇళ్లు స్థలాలు, పొలాలు, ఆస్తిపాస్తులు, ఉద్యోగాలు.... ఇవన్నీ మీకు లభిస్తాయి. వెళ్లండి, నేను చెప్పినట్లు చెయ్యండి" అని చెప్పాడు. దానితో ధనం యొక్క బానిసలు యేసుప్రభువు ధనం గూర్చి చెప్పిన బోధనలను, హెచ్చరికలను మరచి, "అద్భుతం! ఇలా చేయడం వల్ల గొప్ప అవకాశాలు మనకు దక్కుతున్నాయి. అన్నింటికంటే మేలైన విషయం ఏమిటంటే నేను నా క్రైస్తవ్యాన్ని వదలుకోవలసిన పనిలేదు. నేను సంఘంలో ఒక మంచి సభ్యుడిగానే ఉంటూ ధనం సంపాదించుకోవడానికి ఈ పద్ధతులన్నిటిని అనుసరించవచ్చన్న మాట. "చిత్తం ధనప్రభువా, నీవు చెప్పినట్లే చేస్తాను" అంటారు.

మరి యేసుప్రభువు చెప్పిందేమిటి? నీవు ఇద్దరు యజమానులను సేవించలేవు. నీవు దేవునికిని, సిరికిని దాసుడవుగా ఉండలేవు (మత్తయి 6:24). కాబట్టి నీకు కాస్తంతైనా వివేకముంటే ఈ పనులు చేయడానికి ప్రయత్నించకు. ధనంకు దాసోహం చేస్తున్నవారు ధనమే తమకు దాసోహం చేస్తుందనుకొంటారు. కానీ నిజానికి వారే ధనానికి బానిసలైపోయారన్నది వాస్తవం. కాబట్టి ధనం విషయంలో బహు జాగ్రత్తగా ఉండమని నేను మిమ్మును బ్రతిమలాడి చెబుతున్నాను. ధనం మీ హృదయాన్ని జయించకుండా చూసుకోండి. లేకుంటే మీరు తీవ్రంగా నష్టపోతారు. నేను భారతదేశంలో పరిశీలించి

తెలుసుకొన్నదేమంటే శరీరేచ్ఛ అనేకమైన క్రైస్తవులను నాశనం చేసింది గాని, ధనం అంతకు మరనేకరెట్లు మందిని నాశనం చేసింది. స్నేహితుల్లారా మీ ప్రాణాలను దక్కించుకొనుటకు ఈ క్రూరమైన ప్రభువు (ధన ప్రభువు) నుండి తప్పించుకొని పారిపోండి.

ప్రజలు తమ హృదయాల్లో సేవించే మరొక దేవుడు "స్వయం" అనే ప్రభువు. అనగా నేను, నాది, నా కోసం అనే స్వార్ధగుణం. అనేకమందికి ఇతడే అత్యున్నత దేవుడు. ఇంతకు ముందు చెప్పుకొన్న దేవుళ్లందరూ సేవించేది అంతిమంగా ఈ దేవుడినే! ఇతడు తన బానిసలతో "మీరు చేసేదంతా కేవలం మీ కోసమే చెయ్యండి" అని చెబుతాడు. ఇంచుమించు లోకంలో ఉన్నవారంతా వీనినే సేవిస్తారు. ఇతడే అత్యున్నత స్థానంలో ఉన్నవాడు గాని ఇతని వెనుక మరొకడున్నాడు, వాడే సాతాను. సాతాను (ఈ లోకనాథుడు) లోకంలో పైన చెప్పిన దేవుళ్లను సేవిస్తున్నవారంతా నిజానికి వీనినే సేవిస్తున్నారు. శరీరేచ్ఛను సేవించడం ద్వారా నీవు సాతానును సేవిస్తున్నావు. గర్వమును సేవించడం ద్వారా నీవు అతన్నే సేవిస్తున్నావు. ధనంను సేవించడం ద్వారా నీవు సాతాన్నే సేవిస్తున్నావు. ప్రపంచంలో కొన్ని సంవత్సరాలుగా ఉగ్రవాదంపై ప్రజలు, ప్రభుత్వాలు యుద్ధం చేస్తున్నాయి. కానీ విశ్వాసులు నిరంతరం అంతకంటే తీవ్రమైన

యుద్ధంలో నిమగ్నమైయున్నారు. ఈ యుద్ధం హృదయంలో తిష్టవేసుకొన్న విగ్రహాల ఉగ్రవాదానికి వ్యతిరేకంగాను, క్రీస్తుకు విరోధంగా తన్నుతాను హెచ్చించుకొనే ప్రతిదానికి వ్యతిరేకంగాను, నిజ దేవున్ని కాకుండా తమను సేవించేలా మనతో పోరాడుతున్న ప్రతిదానితోను మరియు నిజదేవునిపట్ల మనకున్న అనుబంధాన్ని, భక్తిని, ప్రేమను, సేవాభిలాషను తొలగించే ప్రతిశక్తికి వ్యతిరేకంగాను విశ్వాసులు చేస్తున్నారు. ఈ యుద్ధం ప్రతి విశ్వాసి తప్పక చేసి తీరాల్సిందే! ఈ యుద్ధంలో విజయం పొందాలని ఆశిస్తున్నావా? అట్లయితే దేవుడిచ్చే సర్వాంగ కవచాన్ని ధరించి, ఆయనిచ్చే ఆయుధాలను చేతపట్టి క్రీస్తు యొక్క మంచి సైనికునివలె నీవు పోరాడాలి. మరి మనల్ని బానిసలుగా చేయగల ఈ భీకర యుద్ధంలో పోరాడి గెల్చి ఆయన్ని యథార్థంగా సేవిస్తే, ప్రతిఫలంగా మనం ఏమి పొందుకుంటాం. "ఒకడు నన్ను సేవించినయెడల నా తండ్రి అతని ఘనపరచును" అని యేసుప్రభువు చెప్పారు కదా! (యోహాను 12:26).

నీ ఊహకు మించిన ఘనత, బహుమానాలు, లెక్కకు మించిన శాశ్వత నిధులు దేవుని దగ్గర నీ కొరకు కాచుకొని ఉన్నాయి. ఒకవేళ మనం ఆయన్ని సేవించకపోతే అప్పుడు మనం ఏమి పొందుకుంటాం. సిరి సంపదలు, పేరు ప్రఖ్యాతులు, ఇహలోకపు సకల సౌకర్యాలు, విలాసాలు

మరియు మనుష్యుల వలన మెప్పు మొదలైనవి అనేకం ఈ లోకంలో పొందుకొంటామేమో గానీ అంతంలో వేదన, కన్నీరు, చేదు అనుభవాలు, మరణం మొత్తంగా అతిభయంకరమైన నష్టాన్ని పొందుకుంటాం. అవునండి, ఇలా జరగడం నేనెన్నోసార్లు చూశాను. ఒకరోజు తప్పక మరణిస్తాం లేదా ప్రభువే తిరిగిరావచ్చు. అప్పుడు ఆయన ముందు నిలబడి చేసిన సేవను గూర్చి లెక్క అప్ప చెప్పాలి. అప్పుడు మనం దేనిని సేవించాం, ఎవరిని సేవించాం, ఎలా సేవించాం, ఎందుకు సేవించాం మరియు మన అంతరంగ ఉద్దేశాలు, లక్ష్యాలు, కోరికలు.... ఇవన్నీ కూడా బట్టబయలు చేయబడతాయి. కాబట్టి దైవిక భయం కలిగియుందాం. ఆయన యెదుట సిగ్గుపడనక్కర్లేకుండా ధైర్యముగా నిలబడునట్లు ఈ లోకంలో బ్రతుకుదాం.

ఈ విషయాన్ని జ్ఞాపకముంచుకొందాం– “మనలను ప్రేమించినవాని ద్వారా వీటన్నిటిలో అత్యధిక విజయం పొందుచున్నాము (రోమా 8:37). గనుక మనలను లోబరచుకొన ప్రయత్నించే వాటన్నింటిపై జయం పొందగలం. సాతాను మనపై ప్రయోగించే ప్రతీ ఆయుధం లేక పన్నాగాలన్నిటిపై జయాన్నిచ్చిన దేవుని స్తుతిస్తూ, జయశీలురుగా యుద్ధరంగంలో బలవంతులుగా నిలువగలం. దేవుడు మనకు ఎన్నుకొనే (కోరుకొనే) శక్తిని ఇచ్చారు.

కాబట్టి యెహోషువ ఇశ్రాయేలీయులతో మీరు ఎవరిని సేవించెదరో.... నేడు మీరు కోరుకొనుడి" (యెహోషువ 24:15) అని చెప్పాడు. మనం ఒకవేళ క్రీస్తుని సేవించడం కోరుకుంటే, అదే సమయంలో ఆయన్నిగాక మరి దేనినీ సేవింపకోరుకోకూడదు. ఆయన మన సేవను మరెవ్వరితోను, మరి దేనితోను పంచుకొనడు. మనం ఆయన్ని సంపూర్ణంగా సేవిస్తే ఊహకు మించిన బహుమానాలు యోహాను 12:26లో చెప్పిన ధన్యత, ఘనత లభిస్తాయి. ఆయన్ని సేవించకపోతే కన్నీళ్లు, విచారాలు, భయంకరమైన నష్టం మిగులుతాయి.

ఇప్పుడు నీవు యవ్వనస్థుడవు. ఈ రోజు నీ జీవితంలో గుర్తించదగిన ఒక మైలురాయిని చేరుకొన్నావు. ఇప్పుడు నీ ముందు విస్తారమైన అవకాశాలు మరియు మహిమ వాగ్దానాలతో కూడిన భవిష్యత్తు ఇంకెంతో ఉంది. నీవు ముందుకు సాగడానికి ఏదొక మార్గాన్ని నేడే ఎన్నుకొని కోరుకో! పైన చర్చించిన ఈ అసత్య దేవుళ్ల నుండి, హృదయంలో ఉండే విగ్రహాల నుండి పారిపో! అవన్నీ నిన్ను నాశనం చేసేవే! యేసు ఒక్కడే నీ ప్రభువుగాను, ఆయన ఒక్కడికే నీ హృదయంలో స్థానముండునట్లుగాను ఆయన్ని సేవింపకోరుకో! అట్లు చేసినప్పుడు నీవు యథార్థపరుడవుగాను, ఆత్మతో నింపబడినవాడవుగా ఆయన నిన్ను పంపినచోట్లకు వెళ్లి, ఆయన చిత్తానుసారంగా నడచుకొని, ఆసక్తితో ఆయనను

సేవించేవాడవుగా, దేవునికి బహు ప్రియుడవుగా ఉందువు. నీవు ఆయనను ఆసక్తితో సేవించుచుండగా దేవుడు నిన్ను అత్యధికంగా ఆశీర్వదించును గాక! ఆమేన్!!



# ప్రభువైన క్రీస్తు

ఈ దినాల్లో కొన్ని సంఘాల్లో ఒక వింతైన బోధ వినబడుచున్నది. ప్రభువైన యేసుక్రీస్తుని ప్రభువుగా అంగీకరించకుండానే ఆయనను రక్షకుడుగా పొందవచ్చు అన్నదే ఆ బోధ. ఈ బోధ ప్రభువైన యేసు నుండి వచ్చినది

కాదు మరియు యేసు యొక్క అపొస్తలుల బోధ ఆధారంగా వచ్చినదని కూడా నేను నమ్మను. రక్షణ అనేది కేవలము దేవుని కృప వలననే అనుగ్రహించబడుతుందనే సత్యాన్ని పౌలు కంటే ఎక్కువగా ఏ అపొస్తలులు నొక్కి చెప్పలేదు, సరికదా దేవుని యొక్క రక్షించే కృపకు పౌలు తానే ఒక మాదిరిగా (ఋజువుగా) ఉన్నాడు (1 తిమోతి 1:16). అయినప్పటికినీ దమస్కు మార్గములో దేవునిచేత సంపాదించబడినప్పుడు అతడడిగిన రెండవ ప్రశ్న ప్రభువా! నేనేమి చేయవలెను?" అనునది. ఇక్కడ పౌలు యేసును ప్రభువుగా ఎంచి తక్షణ విధేయత చూపుట కనబడుచున్నది. వాస్తవంగా పౌలు క్రీస్తును రక్షకునిగానో లేక ప్రభువుగానో అంగీకరించుటకు ప్రయత్నించలేదు. దమస్కు దగ్గర కలిగిన ఆ దేవ దర్శనములో క్రీస్తును గూర్చి రక్షకునిగా ఏమియూ చెప్పబడలేదు. అయితే యేసు నిజంగానే ఒక మహోన్నతమైన వ్యక్తి, మనుష్య కుమారుడైన క్రీస్తు, దేవుని కుమారుడు, మనుష్యావతారుడైన యెహోవా దేవుడు, రక్షకుడు, ప్రభువు మరియు రాజు. పశ్చాత్తాపంతో పాపి ఆయన యొద్దకు వచ్చునప్పుడు అతడు (లేక ఆమె) దేవుని లక్షణాలను గూర్చిన ఏదో కొద్ది ఉపదేశం పొంది ఉండవచ్చు లేక ఒకటో రెండో లక్షణాలను గూర్చి కొద్ది అవగాహన కలిగి ఉండవచ్చు. (రక్షింపబడటానికి వేదశాస్త్రం గూర్చి ఎక్కువగా తెలిసి ఉండవలసిన అవసరం లేదు). కానీ

సంపూర్ణుడైన దేవుని లక్షణాలలో ఏ ఒక్క దానిని కూడా అతడు తిరస్కరించలేడు మరియు క్రీస్తు పట్ల అతనికి నిజమైన విశ్వాసం ఉండి తీరుతుంది. ఆశ్చర్యకరుడైన ప్రభువును అంగీకరించుట అనగా మనకు తెలిసింది అత్యల్పమే అయినా ఆయనను ఉన్నదున్నట్లుగా మరియు ఆయనలోని సర్వ గుణలక్షణాలతో సంపూర్తిగా ఆయనను అంగీకరించుటయే! మనం ఆయనను అంగీకరించినప్పుడు ఆయన గూర్చి మనకు తెలిసింది కొంచెమే అయినా ఇక మిగిలిన జీవితకాలమంతా ఆయనను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఆయనకు సంపూర్ణంగా విధేయత చూపుట మరియు ఆయనను వెంబడించుట అనగానేమో తెలుసుకుంటాము. పౌలు వెంటనే యేసును ప్రభువుగా గుర్తించాడు గనుక తానేం చేయాలో చెప్పే హక్కు కూడా ఆయనకుందని గ్రహించి ఆయనిచ్చే ఆజ్ఞల కోసం ఎదురుచూశాడు. ఒక నిజక్రైస్తవ జీవితానికున్న ఏకైక మార్గం ఇదే!

ఈ క్రింద మనం చెప్పుకున్న భావాలను బలపరిచే కొన్ని రిఫరెన్స్‌లను ఇస్తున్నాను. వాటిని మీ బైబిల్‌లో చదువుకొని క్రింద నేనిచ్చే వ్యాఖ్యానాలను పరిశీలించండి.

మత్తయి 4:17 – ప్రతి పాపి క్రీస్తు అధికారానికి వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటును గూర్చి పశ్చాత్తాపపడవలసిన విషయాల్లో

ఇది ఒకటి. ఒకరాజుకు లోబడకుండా ఒకవ్యక్తి అతని రాజ్యంలో ఎలా ప్రవేశించగలడు? అదేవిధంగా సంఘమనే దేవుని దేహానికి యేసే శిరస్సు మరియు ప్రభువై యుండగా ఎవరైనా తన హృదయంలో క్రీస్తు యొక్క ప్రభువు స్థానాన్ని తిరస్కరిస్తూ ఆయన శరీరములోనికి ఆత్మ ద్వారా ఎలా బాప్తిస్మం పొందగలడు? (1 కొరింథీ 12:12,13).

మత్తయి 7:21 – యేసుని ప్రభువుగా అంగీకరించి లోబడుటలో తండ్రియైన దేవుని చిత్తం కూడా ప్రాధాన్యత కలిగి ఉంది (ఫిలిప్పీ 2:9–11).

మత్తయి 16:24–26 – ఒకడు తన్నుతాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తికొని యేసుని వెంబడించుటలో తప్పకుండా ఒకడు తనపై తనకున్న అధికారాన్ని వదులుకోవడం మరియు యేసుకు ప్రభువుగా అన్ని విషయాల్లోనూ లోబడుట ఇమిడియున్నాయి.

మార్కు 10:17–27 – నిత్యజీవం పొందుటకు నేనేమి చేయాలి అంటూ తన దగ్గరకొచ్చిన యవ్వనస్తునితో యేసు, అతడు తన్నుతాను ఆయన అధికారానికి అప్పగించుకొని విధేయత చూపడం మొదలుపెట్టాలని చెబుతూ, నిజమైన విశ్వాసం క్రీస్తును వెంబడించుటలో దేనిని అడ్డురానీయదని సూచనగా తెలియజేశాడు (23వ॥). మరియు దేవుని

రాజ్యంలో ప్రవేశించుటను గూర్చి రక్షింపబడుటను గూర్చి 26,27 వచనాల్లో తెలియజేశారు.

లూకా 6:46 మత్తయి 7:24 – యేసు బోధను నిర్లక్ష్యపెట్టి ఇసుక మీద ఇల్లు కట్టుకున్నవారు రక్షింపబడినవారని భావించగలమా? (మత్తయి 7:26).

లూకా 14:26,27,33 – మనము ఆయన శిష్యులము అనగా ఆయన నుండి నేర్చుకున్నవారము కానిచో ఆయనను రక్షకునిగా ఎరిగియున్నామని అనుకొనగలమా? ఆయన బోధించకుండానే ఆయన ఎటువంటివాడో, రక్షణ అంటే ఏమిటో మరియు ఏవిధంగా పశ్చాత్తాపపడాలో, ఏవిధంగా ఆయనయందు విశ్వాసముంచాలో ఎలా ఎరిగి యుండగలం?

యోహాను 1:10-12 – 10,11 వచనాలు యేసును సృష్టికర్తగానూ, లోకమునకు ప్రభువుగానూ వర్ణిస్తున్నాయి. మరియు 12వ వచనం ఆయనను అట్టివిధంగా అంగీకరించుటను గూర్చి బోధించుచున్నది. 12వ వచనం ఉపయోగించినప్పుడు తరచుగా ఈ సత్యం నిర్లక్ష్యం చేయబడుతుంది.

యోహాను 8:24 – యేసు తాను యెహోవా దేవుని అవతారమని, ఈ విశ్వానికి ప్రభువునని చెబుతూ యూదులు రక్షింపబడటానికి తనను వారు ఆ విధంగా అంగీకరించాలని చెప్పారు.

యోహాను 10:4,14,27 – తన గొర్రెలు తనను తమ కాపరిగా అనగా తమ ప్రభువు మరియు యజమానిగా గుర్తించి తనను వెంబడిస్తాయని ఇందులో తప్పక విధేయత ఇమిడి ఉందని యేసు చెప్పాడు. అవి ఆయనను వెంబడించకపోతే అవి ఆయన గొర్రెలు కావన్నమాటే!

యోహాను 14:15 – ఒకవేళ మనము ఆయనను ప్రేమించకున్నట్లయితే మనము రక్షింపబడినవారమని వ్యర్థముగా ఊహించుకొనగలమా? (1 కొరింథీ 16:22). మనం నిజంగా ఆయనను ప్రేమించుచున్నట్లయితే తప్పక ఆయనకు లోబడతాము. అంటే ఆయనను ప్రభువుగా భావించి లోబడుతామన్నమాట.

అపొ॥ కార్యాలు 2:3,6,38 – యూదులు యేసుని ప్రభువుగానూ మరియు క్రీస్తుగానూ అంగీకరించక తిరస్కరించిన దాని విషయమై పశ్చాత్తాపపడి ఆయనను ఆవిధంగా అనగా ప్రభువుగానూ క్రీస్తుగానూ అంగీకరించాలని పేతురు యూదులతో చెప్పాడు. బాప్తిస్మమనేది అట్టి అంగీకారానికి రుజువుగా (ఆనాటికి ఈనాటికి కూడా) ఉన్నది. అది క్రీస్తును ప్రభువుగా అంగీకరించి పాత జీవిత విధానానికి చనిపోవుటకు మరియు క్రొత్త జీవితం జీవించునట్లు లేపబడుటకు సాదృశ్యంగా ఉన్నది. ఈ సత్యమును గూర్చిన

అవగాహన లేకుండా బాప్తిస్మం పొందకూడదు.

అపొ॥ కార్యాలు 5:32 – పరిశుద్ధాత్మ లేకుండా మనము రక్షించబడతామని గానీ లేక దేవుని కుమారునికి లోబడకుండా పరిశుద్ధాత్మను పొందుకుంటామని గానీ ఊహించగలమా? (రోమా 8:9).

అపొ॥ కార్యాలు 16:31 – చెరసాల అధిపతికి "రక్షకుడైన" యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుము అని చెప్పబడలేదు గాని "ప్రభువైన" యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుము అని చెప్పబడింది. ఆయనకు లోబడని హృదయంలో నిజమైన విశ్వాసం పుట్టగలదని ఊహించగలమా? కాదు గదా! ఎవరైతే ప్రభువునందు విశ్వాసముంచుదురో వారు యేసును తప్పక ప్రభువుగా అంగీకరింతురు (యోహాను 1:12).

రోమా 1:5 – విధేయత మరియు విశ్వాసము ఒకదానితోనొకటి అవినాభావ సంబంధము కలిగియుండటాన్ని మరోసారి ఇక్కడ గమనించగలము. వాస్తవానికి ఒకటి లేకుండా మరోదాన్ని పొందుకోలేము (2 థెస్స 1:8; రోమా 6:17). మనం క్రీస్తునందు విశ్వాసముంచినప్పుడు పరిశుద్ధాత్మ ఆయనకు లోబడే హృదయాన్ని మనకిస్తాడు. ఇది కృప యొక్క గొప్ప బహుమానమే! మనం విధేయతచేత రక్షింపబడలేదు కాని విశ్వాసం ద్వారా కృపచేతనే అనగా మనల్ని విధేయులుగా

చేయు కృప మరియు విశ్వాసంచేత రక్షించబడ్డాము. ఇదికాక మరేవిధమైన విశ్వాసమైనా అది మృతమే! (యాకోబు 2:14-26).

రోమా 6:16-23 – ప్రతివ్యక్తి లోబడుటకు దేనికి అప్పగించుకుంటాడో దానికి దాసుడౌతాడని పౌలు చెబుతున్నాడు. మనం పాపానికి లోబడితే పాపానికి దాసులమౌతాం. దేవునికి లోబడితే దేవునికి దాసులమౌతాము. ఒక మార్గము మరణమునకు దారి తీస్తుంది, మరొక మార్గం నీతికి, జీవానికి దారి తీస్తుంది. అపొస్తలులు విశదంగా బోధించిన బోధకు లోబడుట క్రీస్తుకు మనపైన ప్రభువుగా అంగీకరించుటయే కదా! క్రీస్తును మనం ప్రభువుగా గుర్తించకుండా ఎలా దేవుని దాసులమవ్వగలం?

రోమా 8:14 – దేవుని ఆత్మ మనలను క్రీస్తు అధికారమునకు (ప్రభువుగా) లోబడుటకు నిరంతరం నడిపించుట లేదా? జవాబు అవునని విశదమే! పౌలు కూడా దేవుని ఆత్మచేత నడిపించబడినవారు మాత్రమే రక్షించబడుదురని బోధించుచున్నాడు.

రోమా 10:9 – నోటితో యేసు నా ప్రభువు అని ఒప్పుకొని హృదయముతో మనపై ఆయన అధికారాన్ని దిక్కరించుటను ఊహించుకోగలమా? రక్షించబడే విధానం ఇదేనని భ్రమిద్దామా?

ఇది ఒక వేషధారణ కాదా? ఇక్కడ రక్షణ పొందటంలో ప్రాథమిక విషయాన్ని గూర్చి పౌలు మాట్లాడుతున్నాడని గమనించాలి.

రోమా 14:9 – విశ్వాసంతో తన యొద్దకు వచ్చు ప్రతివానిలో ఆయనే తన ఉద్దేశములను నెరవేర్చ మొదలుపెట్టడా?

ఎఫెసీ 2:10 మరియు ఫిలిప్పీ 1:6 – క్రీస్తును ప్రభువుగా అంగీకరించి లోబడే హృదయాన్ని విశ్వాసికి ఇచ్చుట దేవుడు వారిలో ప్రారంభించిన సత్క్రియలో భాగము.

ఫిలిప్పీ 2:10,11 – ఈ కార్యమును దేవుడు తన కొరకు తన ప్రజలుగా ఉండుటకు పిలిచినవారందరిలో జరుగునట్లు తప్పక చేయును.

కొలస్సీ 2:6 – కొలస్సయి సంఘంవారు యేసుని ప్రభువుగా అంగీకరించారు. వారికి బోధించబడిన విశ్వాసం మరియు వారు పొందుకొనిన విశ్వాసం అదే! నిజ విశ్వాసులందరూ వారి అడుగుజాడలను తప్పక అనుసరిస్తారు.

1 థెస్స 1:9,10 – నిజమైన మార్పు (మారుమనస్సు) ఎలా ఉంటుందో చూపే ఉదాహరణను ఇక్కడ చూస్తున్నాం. యేసుని ప్రభువుగా అంగీకరించకుండా దేవునికి మనం చేయగల నిజమైన సేవ ఏదైనా ఉంటుందా అని మనం ఊహించలేం.

హెబ్రీ 5:9 – ఇక్కడ నిత్యమైన లేక పరసంబంధమైన రక్షణ క్రీస్తుకు లోబడిన వారికే లభిస్తుందని తేటగా చెప్పబడుచున్నది. రక్షించే విశ్వాసము మరియు విధేయతల మూలంగా ఈ నిత్యరక్షణ అనుగ్రహించబడుతుంది. దేవుడు ఎవరికైనా విశ్వాసాన్నిస్తే అదే సమయంలో లోబడే హృదయాన్నిస్తాడు. హెబ్రీ 8:10; యెహెజ్కేలు 36:20,27 కూడా చూడండి.

1 పేతురు 1:2 – ఇక్కడ దేవుడు ప్రజలను ఏర్పరచుకొనడంలో ఉన్న ప్రాథమిక ఉద్దేశాన్ని మరియు వారిని క్రీస్తు నొద్దకు నడిపించుటకు పరిశుద్ధాత్మ చేసిన కార్యాన్ని గమనించండి. అది వారిని యేసుక్రీస్తుకు విధేయులను చేయుటకే! "యేసుక్రీస్తు రక్తం వలన ప్రోక్షింపబడుటకు" అను మాటకు ముందు "విధేయులగుటకు" అని రాయబడుటను కూడా గమనించండి.

1 పేతురు 4:10 – "దేవుని సువార్త" మనుష్యులు విధేయులగుటకే ప్రకటించబడుచున్నదని, దానికి లోబడనివారి కోసం భయంకరమైన తీర్పు రాబోతుందని సూటిగా చెప్పుచున్నారు.

1 యోహాను 2:4-6 – ఈ వాక్యపు వెలుగులో ఆయనకు లోబడే హృదయం లేకుండా యేసుని గూర్చిన నిజమైన రక్షించే అవగాహన సాధ్యమని భావించగలమా?

ప్రకటన 3:14-20 – 14వ వచనంలో ఆయన సంఘానికి తనను తాను రక్షకునిగా తెలియచేసుకొనుటలేదు గాని దేవుని సృష్టికి ఆదియైనవాడుగా, దేవుని సృష్టికి పరిపాలకుడుగా తెలియజేసుకుంటున్నాడు. 20వ వచనం చెప్పేటప్పుడు ఈ సత్యం తరచుగా నిర్లక్ష్యం చేయబడుతుంది. ఆయన ఒక ప్రభువుగానూ, రాజుగానూ ద్వారం వెలుపల నిలబడి తలుపుతట్టుచున్నాడు గనుక ఆయన తప్పక అంగీకరించబడవలసినవాడుగా కనబడుచున్నాడు. ఎప్పుడైతే ఆయన లోనికి వస్తాడో ఆ క్షణమందే ఆయన ప్రభువు, రక్షకుడు, రాజు మొదలైన అన్నివిధాలవాడుగా లోనికివస్తాడు. మనం ఆయన్ని ఉద్దేశపూర్వకంగా స్వీకరించినప్పుడు ఆశ్చర్యకరమైన ఆయన సంపూర్ణ వ్యక్తిత్వమును గ్రహించుటను బట్టి మన ఆధ్యాత్మిక జీవితం మరింత మెరుగవుతుంది. విశ్వాసంతో యేసుక్రీస్తువైపు తిరుగుట అనగా ఆయనను రక్షకునిగాను, ప్రభువుగాను అంగీకరించుటయే అని నిరూపించడానికి ఏవైనా లేఖనాధారాలు అవసరమా? మరియు చాలా ప్రాముఖ్యమైన ప్రశ్న ఏదంటే నీవా పని చేశావా? అనేది. అనగా ఆయనను రక్షకునిగాను, ప్రభువుగానూ అంగీకరించావా? అయితే ప్రతి ఒక్కరు ఈ విధమైన అవగాహన కలిగి ఉండలేరు. అంతేకాదు ప్రభువు నందు విశ్వాసముంచిన తరువాత ఇక ప్రతి విషయంలోనూ పరిపూర్ణంగా ప్రభువుకు లోబడతామనిగానీ,

మనమెన్నటికి ఆయనపై తిరుగుబాటు చేయమని గాని నేను చెప్పుటలేదు. యాకోబు 3:2లో చెప్పబడినట్లు మనమనేక విషయాల్లోనూ మాటయందును తప్పిపోతాము. కానీ ఒక వ్యక్తి విశ్వాసంతో ఆయనవైపు తిరిగినప్పుడు దేవుడు అతని మనస్సులోనూ, హృదయంలోనూ ఒక అద్భుత కార్యం చేస్తాడు, దీనినే నూతన జన్మ అంటాము. వెంటనే దేవుడు తనతో నివాసముండటానికి సాక్షాత్తు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ఆత్మయైన పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తాడు. ఈ పరిశుద్ధాత్మ యేసు ఏమైయున్నాడో దానిని గ్రహించుటకును, ఆయనను రక్షకునిగాను ప్రభువుగాను అంగీకరించి విధేయులగునట్లు శక్తినిస్తాడు. వీటిలో ఒకదానిని అంగీకరించి మరొక దానిని అంగీకరించని వ్యక్తి ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాడు. "ఇతడు మమ్మునేలుట మాకిష్టం లేదు" అని చెప్పువారు (లూకా 19:14). ఆయన విరోధులే గాని మిత్రులు కారు. ఆత్మ సంబంధంగా అబ్రాహాము సంతానమైనవారు (రోమా 4:16) అబ్రాహాము చేసినట్లే "అబ్రాహాము పిలువబడినప్పుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు లోబడి వెళ్లెను" (హెబ్రీ 11:8) అన్నట్లుగా ప్రవర్తించెదరు. యాకోబు 2:14,17,20-22 కూడా చూడండి.

రక్షణ అనేది కృపచేతనే విశ్వాసము ద్వారా లభించునని క్రొత్త నిబంధన గ్రంథము ప్రతి సందర్భంలో బోధించుచున్నది.

క్రీస్తును వెంబడించి ఆయనకు సంపూర్ణ విధేయత చూపే క్రీస్తు యొక్క గొర్రెలనుగా చేయుటకే దేవుడు మనలను రక్షించెనని, యేసుని కాపరిగా (ప్రభువుగా) చేసికొని ఆయనకు లోబడటాన్ని తిరస్కరించే మరే విధమైన విశ్వాసమైనా అదెంత మాత్రము నిజమైన విశ్వాసము కాదని కూడా క్రొత్త నిబంధన బోధించుచున్నది. అస్సలు అలాంటి విశ్వాసము వట్టి భ్రమ మాత్రమే! నిజమైన విశ్వాసమనేది దేవుడిచ్చే వరము. అది మనలను క్రీస్తుకు విధేయులనుగా చేయునట్లు మనలో పనిచేసే దేవుని శక్తి. మరియు ఈ దేవుని వరము ద్వారా దేవుని ధర్మశాస్త్రము మన హృదయముల మీద వ్రాయబడినది (హెబ్రీ 8:10,11).

ఈ సత్యమును గూర్చి బోధించుటలో గల లోపమే (బలహీనతే) అనేక సంఘాలలో మనం చూస్తున్నాం. విశ్వాస లోపము మరియు భ్రమతో కూడిన విశ్వాసమునకు సగము కారణమని నేను నమ్ముచున్నాను. ప్రజలు గనుక యేసును తమ ప్రభువుగా అంగీకరించకుండా కేవలము రక్షకునిగా మాత్రమే అంగీకరించి ఇక మేమెన్నటికీ క్షేమమే అని భావించుకున్నట్లయితే వారు పైన చెప్పిన విధంగానే ప్రయత్నిస్తూ (ప్రవర్తిస్తూ) లోపంతో ఉన్నారు. మనమాలాగున చేయకుండా ఆయన ఏమైయున్నాడో, ఆ సంపూర్ణతతో ఆయనను మన హృదయములోనికి మరియు జీవితంలోనికి ఆహ్వానించి,

అంగీకరించి రాజులరాజు ప్రభువుల ప్రభువైన ఆయన మహా ఘనతకు ఎన్నటికిని విధేయతతో జీవించెదము గాక!



# విశ్వాస వ్యాయామం

క్రీస్తులో విశ్వాసముంచినవారు ప్రతి ఉదయం కొంత సమయం కేటాయించి దేవుని సన్నిధిలో గడుపుతూ, మహిమకరమైన సత్యాల్ని గ్రహిస్తూ ఉంటే ఎంత మేలు! దీన్నొక ఆచారంగా చూడాలనేది నా ఉద్దేశ్యం కాదు. ఆలోచన లేకుండా

కేవలం పైపైకి వాక్యం చదవడాన్ని, తప్పదని చేయాల్సిన పనిగా త్వరత్వరగా ముగించడాన్ని నేనూ సమర్థించను. వాక్యంలోని సత్యాలు లోతుగా మన మనస్సులోకి ప్రవేశించాలి, అనుభవంలోకి రావాలి.  ఫలితంగా విధేయత మనలో కలగాలి.  ఆ సత్యాల్ని ధ్యానిస్తూ, మన దైనందిన జీవితాల్లో అవి వాస్తవికంగా నెరవేరాలని దేవున్ని వేడుకోవాలి.

మన ప్రభువు మాటల్ని గుర్తు చేసుకుందాం; "అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పగా" (యోహాను 8:32).  కీర్తన 1:1–3లో దావీదు ఏమి రాశాడో గుర్తు చేసుకోండి.  "దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.  అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును.  అతడు చేయునదంతయు సఫలమగును".

ఈ రోజు, దేవుని వాత్సల్యాలు ఎడతెగక నిలుస్తాయనీ, అనుదినం కొత్తగా పుట్టుకొస్తాయనీ, ఆయన విశ్వాస్యత గొప్పదనే నా నమ్మకాన్ని కొనసాగిస్తాను (విలాప 3:25).

ఈ రోజు, దేవుడు ఈ విశ్వానికి సృష్టికర్త అనీ, ఆయన నా

తండ్రనీ, నేను ఆయన బిడ్డననీ మళ్లీ గుర్తిస్తాను (యోహాను 1:12; 1 యోహాను 3:1).

ఈ రోజు, నేను క్షమించబడ్డాననీ, నీతిమంతునిగా తీర్చబడ్డాననీ, దేవునితో సఖ్యపడ్డాననీ మళ్లీ గుర్తు చేసుకుంటాను. ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా కలిగిన ఏ కళంకమూ, ఏ డాగూ లేనీ సంపూర్ణ నీతిని నేను ధరించాను.

నా పాపాలన్నిటినీ అవెంత ఘోరమైనవైనా, ఆయన రక్తంలో కడిగేసాడు. మరెన్నటికీ వాటిని ఆయన లెక్కించడు (కీర్తన 103:10-12; యెషయా 44:22; మీకా 7:18,19; రోమా 4:7,8; 5:1; 1 యోహాను 1:7-9).

ఈ రోజు, నేను క్రీస్తుతో ఐక్యపర్చబడ్డాను. ఆయన శరీరమనే ప్రపంచవ్యాప్త సంఘంలో నేను అవయవాన్ని. దానికి ఆయన మాత్రమే శిరస్సు, రక్షకుడూ. ఆయన నాలో, నేను ఆయనలో జీవిస్తున్నాం. కాబట్టి నేను పాపం విషయంలో మృతుడ్ని. దేవుని విషయంలో సజీవుడ్ని! (యోహాను 17:21-23; ఎఫెసీ 1:22,23; కొలస్సీ 1:27; 3:3; రోమా 6:3-6). ఆవిధంగా నేను పరిగణిస్తాను (రోమా 6:11). ఈ సత్యాన్ని వక్రీకరించీ లేక తృణీకరించి, నన్ను తిరిగి పాపపు కాడి క్రిందకు లాగాలని ప్రయత్నించే అపవాదిని ప్రభువైన యేసునామములో ఎదిరిస్తాను (యోహాను 8:44; యాకోబు 4:7; 1 పేతురు

5:8,9).

ఈ రోజు, నేను వెనుకున్న వాటిని వదిలి, దేవుని కృప ద్వారా ముందుకే, గురి వద్దకే, క్రీస్తు యేసులో దేవుని ఉన్నతమైన పిలుపుకు కలిగే బహుమానం పొందాలని పరుగెత్తుతాను (ఫిలిప్పీ 3:13-14).

ఈ రోజు, నన్ను నేనే ఉపేక్షించుకుని, నా సిలువను మోసుకుని, క్రీస్తును అనుసరిస్తాను (లూకా 9:23). మరోసారి నన్ను నేనే అనుదిన యాగముగా, అర్పణగా ఆయనకు సమర్పించుకుంటాను. నా అర్పణ ఆయన అంగీకరిస్తాడని నమ్ముతున్నాను (లేవీ 1:3-17; 6:12; సంఖ్యా 28:3-8; రోమా 12:1).

ఈ రోజు, దేవుని సింహాసనాన్ని కృపాసింహాసనముగా మరలా గుర్తిస్తాను (హెబ్రీ 4:16). పశ్చాత్తాపంతో ఒప్పుకుని, విడిచిపెట్టిన పాపాల విషయంలోనూ, గత వైఫల్యాల జ్ఞాపకాల విషయంలోనూ, నా పాప పతన స్వభావం విషయంలోనూ ఎటువంటి అపరాధ భావానికీ చోటివ్వను.

ఈ రోజు, మన కొరకు దేవుడు నియమించిన ప్రధాన యాజకుడైన యేసురక్తం ద్వారా అతి పరిశుద్ధ స్థలంలో ప్రవేశిస్తాను. ఆయన నాకు సమీపంగా వస్తాడని నాకు తెలుసు (హెబ్రీ 10:19-22; యాకోబు 4:8).

ఈ రోజు, మరలా ఒకసారి దేవుని ఆత్మ సంపూర్ణత నేను నాలోనికి స్వీకరిస్తాను (ఎఫెసీ 5:18). ఆయన అసమర్థుల్ని, సమర్థులుగా చేస్తాడనీ, బలహీనులను శక్తివంతులుగా చేస్తాడనీ నమ్ముతున్నాను. నేనెలా విశ్వసించాలనీ, జీవించాలనీ, సేవించాలనీ ఆయన ఆశిస్తున్నాడో ఆ విధంగా నేనుండేలా ఆయన నాకు సహాయం చేస్తాడు.

ఈ రోజు, మళ్లీ ఒకసారి (మత్తయి 6:9-13) ప్రభువు స్వయంగా నేర్పించిన ప్రార్థనలోని మనవులను గుర్తు చేసుకుంటాను.

ఈ రోజు, నేను సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడైన దేవుని ప్రేమ, సంరక్షణలో ఉన్నానని గుర్తు చేసుకుంటున్నాను. కాబట్టి నేను చింతపడను, దిగులుపడను, దేని గురించీ కలవరపడి, కంగారు చెందను (మత్తయి 6:25,33,34; ఫిలిప్పీ 4:6).

నా వ్యక్తిగత అవసరాలన్నింటినీ, ఆయన సేవలో ఎదురయ్యే అవసరాలన్నింటినీ ఆయన తీరుస్తాడు. నిరాశపరిచే, కృంగజేసే ఆలోచనల్ని దగ్గరికి రానివ్వను. ఆయన మీదనే నా దృష్టిని నిలుపుతాను. నా జీవితంలోని అన్నింటికీ ఆయనే అధిపతి. నా మేలు కోసం అన్నీ సమకూడి జరిగేలా ఆయన చేస్తాడు (హెబ్రీ 12:2; రోమా 3:28).

ఈ రోజు, ఆయన స్వరం వినడానికి, జ్ఞానపు వాకిట వేచి

ఉంటాను (సామెతలు 8:34). నాపట్ల ఆయనకున్న ప్రస్తుత, భవిష్యత్ చిత్రాన్ని తెలుసుకుంటాను. అది పరిశుద్ధమూ, పరిపూర్ణమూ అని నమ్ముతాను (రోమా 12:2; కొలస్సీ 1:9). ఆయన నన్ను తన సత్యంతో నడిపించి, నాకు బోధిస్తాడని నమ్ముతున్నాను (కీర్తన 25:5).

ఈ రోజు, నేను ప్రభువులో, ఆయన శక్తిలో బలంగా ఉండాలని తీర్మానించుకుంటున్నాను. ఆయన సర్వాంగ కవచాన్ని ధరించాలనీ, ఆత్మ ఖడ్గాన్నీ, విశ్వాసపు డాలునీ ఉపయోగించాలనీ తీర్మానించుకుంటున్నాను (ఎఫెసీ 1:19,20; 6:10–17; కొలస్సీ 1:11). నాకు వ్యతిరేకంగా ఎదురొచ్చే దేనినైనా నేను జయించాలని దృఢంగా తీర్మానించుకున్నాను (రోమా 8:37; 2 కొరింథీ 2:14).

ఈ రోజు, నా హృదయపు కోరిక ఏమిటంటే, ప్రార్థనా జీవితాన్ని జీవించి, తద్వారా ఎఫెస్సీ 6:18, 1 థెస్స 5:17 నెరవేర్చాలి.

ఈ రోజు, ఈ వాక్యాల ప్రకారంగా దేవుని స్తుతించి, కృతజ్ఞతలు చెల్లించి, విశ్వసించి, విధేయత చూపించి, ప్రేమించి, సేవించి, మహిమపర్చాలని ఆశిస్తున్నాను (కీర్తన 33:1; 1 థెస్స 5:18; సామెతలు 3:5; మార్కు 11:22; 1 సమూ 15:22; రోమా 6:16; మత్తయి 22:37; 1 యోహాను 4:16-21;

యోహాను 12:26; 1 కొరింథీ 15:58; 10:31).

ఈ రోజు, నా ధ్యేయం, నా హృదయ కోరిక ఏమిటంటే ఎఫెసీ 3:16–19లోని వాస్తవికతను దైనందిన జీవితంలో అనుభవించాలి.

ఈ రోజు, మరోసారి నేను ఒప్పుకుంటున్నాను. పైన చెప్పినవన్నీ అనుభవంలోకి రావాలన్నా, నా బలహీనత, స్వార్థం, అపనమ్మిక, గర్వం, భ్రష్టత్వాన్ని జయించాలన్నా కేవలం దేవుని శక్తి, కృప, సన్నిధి ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. నా అనుభూతులు, అనుభవాలు, పరిస్థితులను నమ్మటం కాదు, ఆయన్ని మాత్రమే నమ్మాలి. ఆయన మహిమ కోసం విశ్వాస జీవితాన్ని జీవించేందుకు, అన్నివిధాలా ఆయనను సంతోషపెట్టే జీవితాన్ని జీవించేందుకు ఒక్కో మెట్టు ఎక్కుతూ, ఒక్కో అడుగు ముందుకేస్తూ సాగుతాను (కొలస్సీ 1:10).

ప్రభూ! సహాయం చెయ్యి, నేను పూర్తి బలహీనుడ్ని, పాపిని, అలసిపోయాను. నీవే నాకున్న ఏకైక ఆశ, ఆధారం (యెషయా 40:29–31; కీర్తన 33:20; 146:5; కొలస్సీ 1:27). ఈ రోజు నా కన్నుల్ని, నా తలంపుల్ని, నా కోరికల్ని, నా హృదయాన్ని కాచుకోవడానికి సహాయం చెయ్యి. క్రీస్తు వాక్యం సమృద్ధిగా నాలో నివసించేలా, నా ప్రవర్తనను నియంత్రించేలా సహాయం చెయ్యి. ఈ రోజు ఇతరుల కోసం (1 తిమోతి 2:1–4),

దేవుని పని కోసం, ఆయన సేవకుల కోసం (మత్తయి 9:38) ప్రార్థించాలనీ, ఇతరులకు చేయగలిగినంత మేలు చేయాలనీ తీర్మానించుకుంటున్నాను.



# క్రీస్తు
# పాఠశాల

"మీరు నా వాక్కులో నిలిచి ఉంటే నాకు నిజమైన శిష్యులుగా ఉంటారు. అప్పుడు మీరు సత్యం గ్రహిస్తారు, సత్యం మీకు విడుదల కలిగిస్తుంది." (యోహాను 8:31,32).

అవును, ప్రభువైన యేసుక్రీస్తుకు ఒక పాఠశాల ఉంది. తలుపులు తెరచేవున్నాయి. ఆయన విద్యార్థుల కోసం చూస్తున్నాడు. ఆయన వారిని (ఈ విశాల భూప్రపంచంలో ఎక్కడ వున్నప్పటికీ) పిలుస్తున్నాడు. అయితే ఆయన పాఠశాలలోకి అందరూ ప్రవేశించలేరు. ఈ పాఠశాల కోసం అవసరమైన దృక్పథాలూ లక్షణాలూ ఎవరికైతే ఉంటాయో వారిని మాత్రమే ఆయన ఎంపిక చేస్తారు. ఆయనది ఒక సాధారణమైన పాఠశాల కాదు. అటువంటిది మరెక్కడా లేదు. అది ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించిన పాఠశాల. అందులోని విద్యార్థులు ఎలా జీవించాలో, దేవున్నెలా ఆరాధిస్తూ, సేవించాలో నేర్చుకుంటారు. వారు నేర్చుకోవాలని ఆయన కోరేదేమిటంటే, సమస్త జ్ఞానానికి మించిన జ్ఞానాన్ని— దేవునిగురించిన ప్రత్యక్ష, వ్యక్తిగత జ్ఞానం, ఆయన వాక్యం, ఆయన మార్గాలు, ఆయన చిత్తం.

క్రొత్త నిబంధనలో యేసు విద్యార్థులు "శిష్యులు"గా పిలువబడ్డారు. "మాథిటిస్" అనే గ్రీకు పదానికి ఇది అనువాదం. "విద్యార్థులు" 'నేర్చుకునేవారు' అని అర్థం.

యేసుప్రభు బోధల్ని ఆచరణలో పెట్టాలనే ధ్యేయంలో ఎవరైతే ఆయన దగ్గర నేర్చుకుంటారో వారే నిజమైన శిష్యులని బైబిలు భావం.

ఈ పాఠశాలకున్న గొప్ప అద్భుతమైన సంగతి ఏమిటంటే, సర్వ కాలాల్లోనూ గొప్పవాడైన ఉపాధ్యాయుడు ఇందులో ఉన్నాడు. యేసు స్వయంగా (తండ్రి, పరిశుద్ధాత్మునితో కలిసి) బోధిస్తున్నాడు (కీర్తన 119:102; యోహాను 3:2; 6:45; 14:26; 1 యోహాను 2:20,27 చూడండి).

క్రీస్తు బడిలో ఉపదేశించడానికి దేవుడు మానవ బోధకుల్ని కూడా ఉపయోగిస్తాడు. ఎఫెసీ 4:11–13 చూడండి. అటువంటివారు సత్యాన్ని నేర్పటం నిస్సందేహంగా సంఘానికి గొప్ప ఆశీర్వాదం. అయితే క్రీస్తు బడిలో సఫలత, సిద్ధి కావాలంటే ఆయన పైనా, ఆయన వాక్యం పైనా ఆధారపడాలే కానీ మరే ఇతర మానవ ఉపదేశకుని పైనా కాదు. ఆయన బడిలోని ఒకే ఒక గొప్ప పాఠ్య పుస్తకం ఏమిటంటే – బైబిలు. మనకు పరిస్థితులూ అనుభవాల్ని, మన హృదయాలు మనసుల్లో తన ఆత్మ కార్యాన్ని – అన్నిటినీ ఆయన వాడతాడు.

యేసు బడిలో కాకుండా మరే ఇతర వేదాంత పాఠశాలలోనో, సెమినరీలోనో లేక మత సంస్థలోనో మనం చేరినట్లయితే అక్కడ కేవలం మనుషులు మాత్రమే బోధిస్తారు. ఆయన బడిలో చేరవలసిన అవసరం మనకెంతగా ఉందో తెలియజేయటం తప్ప అలాంటి సంస్థలలో

విద్యాలయాలలో యేసు బోధించటం ఉండదు. మనం కేవలం మనుషుల ద్వారా మాత్రమే బోధను అంగీకరించి, దేవుని దగ్గర నేర్చుకోకుండా ఉంటే మన జీవితం, మన సేవ (సేవ ఉంటే) మనుషుల దృష్టికి విజయవంతంగా కనిపించవచ్చు, గానీ దేవుని దృష్టికి అదంతా వైఫల్యమే.

దావీదు రాజులాగా మనమంతా "నీ త్రోవలేవో నాకు తెలియజేయి. నీ విధానాలేవో వివరించి చెప్పు. నేను నీ సత్యాన్ని అనుసరించేలా చేసి నాకు ఉపదేశించు" (కీర్తనలు 25:4,5) అని ఆక్రందిస్తే ఎంత బావుణ్ణు! దేవుడే మన గురువు అయినప్పుడు మనం చాలా అద్భుతమైన సంగతులు నేర్చుకుంటాం. ఆయన మనకు గురువుగా లేనట్లయితే మన విధ్యాబ్యాసం అధికంగా పరిమితమైపోతుంది. మనకు అవసరమైన ఆధ్యాత్మిక సత్యం లేక ఆధ్యాత్మిక జీవనాన్ని అది మనకు దక్కనివ్వదు. మనుషులు మన మనసులకు వివిధ సత్యాల గురించి తెలియజేస్తారు. యేసైతే ఆ సత్యాల వెనుక ఉన్న సంగతిని చూడగలిగేలా మన మనసుల్ని తెరుస్తాడు. ఆయన దేవుని వాక్యాన్ని పలకటం మాత్రమే కాదు, తన శిష్యులకు దానిని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ఇస్తాడు (లూకా 24: 45).

శిష్యుడు(లు) అనే పదం క్రొత్త నిబంధనలో 270 సార్లకు

పైగా కనిపిస్తుంది. అపొస్తలుల కార్యముల గ్రంథములో 25 సార్లు కనిపిస్తుంది. క్రీస్తులో విశ్వాసముంచి, బాప్తిస్మం తీసుకున్న వారిని ఉద్దేశిస్తూ సామాన్యంగా వాడిన పదమిది. క్రైస్తవుడు(లు) అనే పదం కొత్త నిబంధనలో మూడు సార్లే కనిపిస్తుంది. విశ్వాసం, విశ్వాసముంచటం అనే పదాలు ఎక్కువ సార్లు వాడబడినప్పటికీ 'విశ్వాసులు' అనే పదం రెండు సార్లు మాత్రమే కనిపిస్తుంది. దీనినిబట్టి క్రీస్తు విశ్వాసులూ, నిజ శిష్యులూ మధ్య ఎటువంటి వ్యత్యాసాన్ని క్రీస్తు రాయబారులు కనబర్చలేదనిపిస్తుంది. ఆ మాటకొస్తే యేసుప్రభువు కూడా. యేసు మనకు నేర్పకుండా మనం ఆయన నిజ విశ్వాసులం కావటం అసంభవం. ఆయన మనకు నేర్పకపోతే మనం నిజమైన పశ్చాత్తాపం అంటే ఏమిటో తెలుసుకొని పశ్చాత్తాపపడడం ఎలా? ఆయనలో విశ్వాసముంచటం అంటే ఏమిటో, తెలుసుకొని విశ్వాసముంచటం ఎలా? ఆయనలో విశ్వాసముంచటం, ఆయన శిష్యునిగా అవ్వటం రెండూ కలిసి సాగుతాయి. వాటిని మనం విడదీయరాదు. కొందరు అనుకుంటున్నట్టుగా మనమిప్పుడు విశ్వాసులుగా మారి, కొంత కాలమయ్యాక, మనం నిజంగా క్రీస్తును అనుసరించాలనుకున్నప్పుడు, శిష్యులుగా అవుతామని అనుకోవద్దు. బైబిలులో అటువంటిదేమీ లేదు, కొత్త నిబంధన పద్ధతిలో క్రీస్తులో నిజంగా విశ్వాసముంచటం అంటే క్రీస్తు

బడిలో ప్రవేశించటమే. శిష్యుడుగా ఉండటం ఇష్టం లేకుండా విశ్వాసిగా ఉండాలని ప్రయత్నిస్తున్నావేమో జాగ్రత్త! ఈ విషయంలో నిన్ను నీవే మోసం చేసుకోవటం చాలా సులువు. ఎందుకంటే సైతాను పొంచి తిరుగుతున్నాడు.

కొంతమట్టుకు విచిత్రమైన సంగతేమంటే క్రీస్తు అపొస్తలులు సంఘాలకు రాసిన లేఖల్లో 'శిష్యుడు' అనే పదం కనిపించదు. క్రైస్తవులు అని సూచించేందుకు 'సహోదరులు' అని రాశారు. "సహోదరులు" అనే పదం సుమారు 140 సార్లు వాడటం, క్రీస్తులోని విశ్వాసుల ఆధ్యాత్మిక సన్నిహితత్వాన్ని సూచిస్తుంది. అయితే యేసుప్రభువు తమకు చెప్పినదాన్నే అపొస్తలులు చేసినట్టుగా స్పష్టమవుతుంది. అదేమిటి?

"కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనాలను శిష్యులుగా చేయండి" అని ఆయన అన్నాడు. (మత్తయి 28:19కి ఇది గ్రీకు అక్షరార్థం). కాబట్టి క్రీస్తుపట్ల విధేయత మూలంగానే అపొస్తలులు శిష్యుల్ని తయారు చేశారు. యేసు తమకు బోధించినవన్నీ, వెల్లడి చేసినవన్నీ వారికి నేర్పించారు. అపొస్తలుల లేఖల్లో 'శిష్యుడు' అనే మాట కనబడకపోయినప్పటికీ 'శిష్యత్వం' అనే వాస్తవం అడుగడుగునా కనిపిస్తుంది.

సాధారణంగా, ప్రైవేట్ స్కూల్స్, యూనివర్సిటీలలో

ప్రవేశించటానికి కొన్ని అర్హతలు కావాలి. విద్యార్థులకు కొన్ని యోగ్యతలు ఉండాలి. మనుషుల పాఠశాలలకు నియమ నిబంధనలు ఉన్నా, ఉండకపోయినా, క్రీస్తు పాఠశాలలో ప్రవేశానికి కొన్ని ఖచ్చితమైన నియమ నిబంధనలున్నాయి. ఆయన కోరే దృక్పధాలు మూడు. మనుషుల పాఠశాలల్లా ఇక్కడ తెలివితేటలు, ప్రతిభా పాటవాలతో పనిలేదు. యేసు తన దృష్టికి మరింత ప్రాథమికమైన ప్రాముఖ్యమైన విషయాన్ని పరిశీలిస్తాడు. యేసు కోరేవి హృదయం, అంతరంగం, రహస్య జీవితం, సంకల్పాలతో ముడిపడి ఉన్నాయి. ఆయనకు కావల్సినవి సరైన వైఖరులు, హృదయ పరిస్థితులు వాటి గురించి ఆయన చాలా స్పష్టంగా లూకా 14:25-35లో చెప్పాడు.

**మొదటిది:** స్వయంగా యేసు మాటల్లోనే విందాం, "నా దగ్గరకు వచ్చేవాడెవడైనా సరే, తన తండ్రినీ తల్లినీ భార్యనూ పిల్లలనూ అన్నదమ్ములనూ అక్కచెల్లెళ్ళనూ తన ప్రాణాన్ని కూడా ద్వేషించకపోతే నా శిష్యుడు కాలేడు." 'ద్వేషించడం' అనే కఠినమైన మాటను మనం గమనించాలి. యేసు పట్ల మన ప్రేమ ఎంత గొప్పగా ఉండాలంటే ఈ లోకంలోని మరి ఎవరిపట్లా మన ప్రేమ ద్వేషంలాగా ఉన్నట్టుండాలి అని యేసు అంటున్నాడు. శిష్యుడు కాగోరే వారు తమను యేసునుంచి దారి మళ్ళించగల ఎవరి ప్రభావమైనా — తమకు అత్యంత

ప్రియులైన వారి ప్రభావం కూడా – ద్వేషించాలి. దీని అర్థం మనం అక్షరాలా ద్వేషించాలని కాదు, మనం మన శత్రువులను సైతం ప్రేమించాలి (మత్తయి 5:43,44). అలాంటప్పుడు మన కుటుంబ సభ్యుల్ని మరి ఖచ్చితంగా ప్రేమించాలి. లూకా 14:26లో 'ద్వేషించటం' అనే దానికి 'తక్కువ ప్రేమ' అనే భావంతో వాడబడింది. మత్తయి 10:37తో పోల్చిచూడండి. కాబట్టి మొదటి దృక్పథం ఇదే! క్రీస్తుపట్ల, ఇతరుల పట్ల మన హృదయ పరిస్థితి సరిగా ఉండాలి. మన హృదయాల్లో యేసే ప్రథమ స్థానం వహించాలి.

**రెండోది:** "తన ప్రాణాన్ని కూడా ద్వేషించకపోతే . . . తన సిలువ మోసుకొంటూ నా వెంట రానివాడెవడూ నా శిష్యుడు కాలేడు"

తనను తాను కాదనుకునే దృక్పథం ఇక్కడ కనబడుతుంది. ఇది ఆత్మత్యాగం, వైరాగ్యం అహం సిలువకు చెందాలని గుర్తించటం. ఇది లేనట్లయితే మనం యథార్థంగా క్రీస్తును అనుసరించలేము. అహం పరిపాలించటం చాలామందిలో చూస్తున్నాం (కొన్నిసార్లు మనందరి విషయంలోనూ ఇది నిజమే). అహం స్వంత కోర్కెలు నెరవేర్చుకునేందుకు దబాయిస్తుంటుంది. కానీ క్రీస్తు బడిలో అహాన్ని సింహాసనం నుండి త్రోసివేయటం జరుగుతుంది. అహాన్ని సంతృప్తి

పర్చుకూడదు. గారాబం చేయరాదు. హెచ్చించకూడదు. క్రీస్తు కోసం దాన్ని తిరస్కరించాలి. క్రీస్తు బడిలో ఇది చాలా చాలా ప్రాముఖ్యం. కాబట్టి మన పట్ల మన దృక్పథం, హృదయపరిస్థితి సరైనదిగా ఉండాలి.

**మూడోది:** "మీలో తనకున్నదంతా వదులుకోనివాడెవడైనా సరే నా శిష్యుడు కాలేడు." అనగా భౌతికమైన వాటిపట్ల మన దృక్పథం, హృదయపరిస్థితి సరిగా ఉండాలి. శాశ్వతజీవం పొందటం కోసం ఏమి చేయాలంటూ వచ్చిన యువ అధికారితో యేసు చెప్పినదిదే (మార్కు 10:17-22). యేసు మన నుండి అతడికన్నా తక్కువ ఆశిస్తాడంటారా? లేదు. మనల్ని ప్రేమించినట్టే అతణ్ణి ప్రేమించాడు. కాబట్టే అతనికి అవసరమైన సత్యాన్ని బోధించాడు యేసు. మనమూ ఆయన సేవకులమవ్వాలంటే భౌతిక వస్తువులకు బానిసలు కాకుండా విడుదల పొందాల్సిన అవసరం ఉంది. ఈ భూమి మీద జీవిస్తున్నప్పుడు మనకు అవసరాలుంటాయి. మన మీద ఆధారపడినవారిని మనం బాగా చూసుకోవాలి. అందుకోసం డబ్బు అవసరమే. అయితే హృదయాల్లో మనకున్నదంతా దేవునిదేనని భావించి, దాన్ని దేవుని మహిమ కోసం వాడే ప్రయత్నం చేయాలి. మనం ఆయన్నెంతగా ప్రేమించాలంటే మనకున్న సమస్తాన్ని ఆయన పాదాల చెంత పెట్టడం ఆనందకరమవ్వాలి. అంతేకానీ బాధ, భారం కాకూడదు.

వాస్తవానికి ఈ మూడు దృక్పథాలను హృదయపరిస్థితులను ఒక్కటిగా కుదించితే – ప్రేమ. యేసుకు కావాల్సినది కేవలం మన హృదయం. దాన్ని మనం ఆయనకిచ్చినప్పుడు ఆయన పట్ల మన ప్రేమ ఇతరుల పట్ల, ఇతరమైన వాటి పట్ల ఉన్న ప్రేమ కంటే గొప్పదవుతుంది. మనం ఆయన్ని ప్రేమించనట్లయితే గొప్ప ప్రమాదంలో ఉన్నాం. 1 కొరింథీ 16:22 ఈ విషయాన్నే చాలా బలంగా చెబుతుంది – "ఎవరికైనా సరే ప్రభువైన యేసు క్రీస్తంటే ప్రేమ లేకపోతే వారు శాపానికి గురి అవుతారు గాక! "

మన హృదయాన్ని ఆయనకు ఇవ్వనట్లయితే మనకు మిగిలేదేమంటే హృదయం లేని క్రైస్తవం. దాన్ని బట్టి ఆయన కన్నా ఇతరులకు లేక భౌతికమైన వాటికీ లేక అహానికీ అధిక ప్రాధాన్యతనిస్తామని స్పష్టమవుతుంది.

యేసు అడుగుతున్న ఈ మూడు కష్టతరంగా అగుపిస్తున్నాయా? మనం ఆయన్ని ప్రేమించనట్లయితే అవి కష్టతరం మాత్రమే కాదు, అవి అసాధ్యాలవుతాయి. యేసు ఎవరో దేవుని ఆత్మ మనకు అవగతం చేసివుంటే, ఆయన సిలువ మీద మనకోసం ఏమి చేశాడో నిజంగా మనకు అర్థమైవుంటే, పవిత్రాత్మ ద్వారా మన హృదయాల్లో దేవుని ప్రేమ కుమ్మరించటం జరిగి ఉంటే (క్రీస్తులో మనం విశ్వాసముంచినప్పుడు ఇది జరుగుతుంది) ఈ

హృదయపరిస్థితులన్నీ సహేతుకంగా సహజంగా అనిపిస్తాయి. ఈ విషయం తెలుసుకోండి – ఇతరుల పట్ల, మనపట్ల, భౌతికమైన వాటిపట్ల, దేవుని పట్ల సరైన దృక్పథం మనం కలిగివుండేలా చేసేది క్రీస్తే. ఈ గుణాలు పుట్టుకతో మనకి రావు. మనం పాపులం. స్వభావసిద్ధంగా మనం అహాన్నే, ఇతరుల్నే, మనకి నచ్చిన వాటినే ఎన్నుకుంటాం. కానీ ఆయన తన కృప ద్వారా మనకు అవసరమైన దృక్పథాలనిస్తాడు. ఆ కృప మూలంగానే ఆయన మన హృదయాల్లో కార్యం చేసి, ఆయన బడిలో ఉండటానికి మనల్ని తగినవారినిగా చేస్తాడు.

"శిష్యుడు కాలేడు" అని మూడు సార్లు యేసు చెప్పారంటే, పేరుకు శిష్యుడైన వాణ్ణి కాదు కానీ నిజంగా శిష్యుడైన వాణ్ణే సూచిస్తున్నాడు. క్రీస్తు రోజుల్లో చాలా మంది ఆయన్ని అనుసరించారు. ఆయన శిష్యుల్లా అగుపించారు. ఆయన బోధలు విన్నారు కానీ ఆయన నుండి నేర్చుకున్నవారు, ఆయన బోధను ఆచరణలో పెట్టినవారు ఎంతమంది? ...కొద్దిమందే! తమకు అర్థం కాని కఠిన మాటల్ని ఆయన పలికినప్పుడు ఆయనతో పాటు నిలిచిన వారెంత కొద్దిమందో! యోహాను 6:66–68 చూడండి.

యేసు లూకా 14:25–35లో చెప్పినది కేవలం సత్యం. యేసు కోరిన హృదయపరిస్థితులు నీలో లేనట్లయితే క్రీస్తు

పాఠశాలలోకి నీకు ప్రవేశం లేదు. క్రైస్తవుడుగానో, క్రీస్తు శిష్యుడుగానో నీకు పేరు ఉండవచ్చు. కానీ అవి లేకపోతే నీవు నిజ శిష్యుడివి కావు. ఆ ప్రవేశద్వారం దగ్గర అటూ ఇటూ తచ్చాడుతుంటే సత్యం గురించి కొంత సమాచారం నీకు దొరకవచ్చు. కానీ దానితోనే సరిపెట్టుకుంటావా?



# లోక సమృద్ధి

క్రీస్తులోని ఒక నిజ విశ్వాసికి ఆర్థికసమృద్ధి చెందాలనే లక్ష్యము ఉండవచ్చా? ఒక యేసు అనుచరుడు ధనవంతుడు కావాలని కోరుకోవచ్చా?

మనుషులు అనుకునే లోక జ్ఞానం ద్వారా కాకుండా, బైబిలు ఆధారంగా ఈ ప్రశ్నలకు జవాబు చెప్పడం సులువే. దీని గురించి బైబిలు ఏమి బోధిస్తుందో తెలుసుకోకుండా, ఎవరో ప్రసంగీకుని బోధనలనో, లేక ఆర్థిక విజయాల గురించి ఎవరో లౌకిక బోధకుల మాటలనో అనుసరించాలని నీకున్నట్లయితే, వెంటనే దీన్ని చదవడం ఆపేయి. బైబిల్ ఏమి చెబుతుందో అది మాత్రమే తెలుసుకోవాలనుకుంటే చదవడం కొనసాగించు. ఈ అంశాన్ని పరిశీలించేటప్పుడు మనమొక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనమిప్పుడు క్రొత్త నిబంధన కాలంలో ఉన్నాం. పాతనిబంధన కాలంలో కాదు. పాత నిబంధన రోజుల్లో పరిస్థితులు ఇప్పటిలా ఉండేవి కావు. కొన్ని విషయాల్లో దేవుడు తన ప్రజలతో వ్యవహరించిన తీరు చాలా భిన్నంగా ఉంది. ఆయన వారికి చేసిన కొన్ని వాగ్దానాలు కూడా భిన్నమైనవి. అవి ఇప్పటి విశ్వాసులకు వర్తించవు. ఉదాహరణకు పాత నిబంధన రోజుల్లో, ప్రజలు తన వాక్కును అనుసరించి ప్రవర్తిస్తే వారిని దీవించి, సమృద్ధిగా చేస్తానని దేవుడు వాగ్దానం చేసాడు. ఐశ్వర్యాన్ని కోరుకోవడం నిషిద్ధం కాదు. ద్వితీ 8:18; 28:1-14; కీర్తన 112:1-3; సామెతలు 3:16; 24:3,4; మలాకీ 3:10 చూడండి.

పాత నిబంధన గ్రంథపుటల్లో కొంతమంది నీతిమంతులూ ధనవంతులైన వ్యక్తులు మనకు కనిపిస్తారు. వారు తమ ఆస్తుల్ని

విడిచిపెట్టాలని, అధికంగా ఆర్జించరాదని ఉపదేశంలేదు. అయితే, ఆస్తులు శాశ్వతం కాదని, వాటిని నమ్ముకోరాదనే హెచ్చరిక మాత్రం స్పష్టంగా ఉంది.

మరి, దేవుని వాగ్దానాలు ఎప్పటికీ మేలుకరమే కదా అని కొందరు అడుగవచ్చు. నిజమే, దేవుడు వాటి నెవరికిచ్చాడో వారికవి మేలుకరం. అది కూడా వాటి విషయంలో ఆయన విధించిన షరతులు అమలు పరిచినంతకాలమూ అవి మేలుకరమే. కానీ, మోషేతో దేవుడు చేసిన పాత నిబంధన కింద, ఇస్రాయేల్ ప్రజలకు ఇవ్వబడిన వాగ్దానాలు కొత్తనిబంధన కింద జీవిస్తున్న క్రీస్తు శిష్యులకు తప్పనిసరిగా వర్తిస్తాయి అని లేదు. పాత నిబంధన భౌతిక విషయాలూ వస్తువులూ కొత్త నిబంధనలో ఉన్న ఆధ్యాత్మి విషయాలకు నమూనాలూ సాదృశ్యాలూ సూచనలూ మాత్రమే. ఉదాహరణకు, ప్రత్యక్ష గుడారం (సన్నిధి గుడారం) భౌతిక సంబంధమైనది. అక్కడ జరిగే కార్యకలాపాలన్నీ భౌతికమైనవే. అయితే పరలోక సంబంధమైన ఆధ్యాత్మిక వాస్తవాలకు అది ఒక నమూనా, సాదృశ్యం, సూచన. హెబ్రీ 9:1–15 చూడండి. ఆ మాటకొస్తే మోషే ధర్మశాస్త్రమంతా కూడా ఎప్పుడో జరుగబోయే వాటికి ఒక ఛాయా రూపమే. నేటి క్రీస్తు విశ్వాసులకు వాగ్దానం చేయబడిన శాశ్వత, ఆధ్యాత్మిక సౌభాగ్యం, పరలోక ఐశ్వర్యాలకు మోషే ధర్మశాస్త్రంలో ఒక వాగ్దానం చేయబడిన

ఐహిక, తాత్కాలిక ఆర్థిక సమృద్ధి ఒక సాదృశ్యం అనవచ్చు. మనం కొత్త నిబంధన కింద, క్రొత్త శకంలో జీవిస్తున్నాం. ఈ శకానికి తనదైన ఒక స్వంత ప్రవర్తనా నియమావళి, తనదైన వాగ్దానాలు, తనదైన ప్రతిఫలాలు ఉన్నాయి. కొండమీది ప్రసంగంలో యేసు దీని గురించి అయిదుసార్లు రెట్టించి చెప్పారు చూడండి. "పూర్వికులకు చెప్పినది మీరు విన్నారు గదా. అయితే మీతో నేనంటాను" పూర్వికులకు చెప్పినది పాత నిబంధన విషయాలు. యేసు చెప్పిన సంగతులు దేవుని సరికొత్త రాజ్యానికి సంబంధించినవి.

ఎవరైతే పశ్చాత్తాపపడి, క్రీస్తునందు విశ్వాసముంచారో వారే ఆయన శిష్యులు. ఆయనేమి బోధించారో వాటిని అర్థం చేసుకుని, వాటిని ఆచరణలో పెట్టటమే వారి ప్రధాన కర్తవ్యం. విశ్వాసులైన మనం ఆయన అనుచరులం. మనం ఏ వ్యక్తికీ, అతనెంత ప్రముఖుడైనా, అనుచరులం కాదు. కాబట్టి ఆర్థికాభివృద్ధి గురించి, ఐశ్వర్యాల గురించి, ఈలోక వస్తు వాహనాదుల గురించి యేసు ఏమి బోధించాడో పరిశీలిద్దాం. అలాగే క్రీస్తు రాయబారులైన అపొస్తలులు ఏమి బోధించారో పరిశీలిద్దాం.

ధనం గురించి ఆస్తుల గురించి యేసు చాలానే చెప్పాడు. మొదటిగా ఈ లోక సంపద కోసం మనం ప్రాకులాడకూడదని

ఆయన చాలా స్పష్టంగా చెప్పారు. “భూమిమీద మీ కోసం సంపద కూడబెట్టుకోకండి. ఇక్కడ చిమ్మెటలు, తుప్పు తినివేస్తాయి. దొంగలు కన్నం వేసి దోచుకొంటారు. పరలోకంలో మీ కోసం సంపద కూడబెట్టుకోండి. అక్కడ చిమ్మెటలు, తుప్పు దానిని తినివేయవు. దొంగలు కన్నం వేసి దోచుకోరు. (మత్తయి 6:19,20)

ఇతరుల్ని ప్రేమించండి, ప్రార్థించండి వంటి ఆజ్ఞల్లానే ఇది కూడా ఆయన మనకిచ్చిన ఒక ఆజ్ఞ. ఇదే అధ్యాయంలో యేసు ఇంకా ఇలా బోధిస్తూ వచ్చాడు. “అందుచేత నేను మీతో చెప్పేదేమిటంటే, ‘మా అన్నపానాల మాటేమిటి?’ అంటూ మీ బ్రతుకును గురించి బెంగ పెట్టుకోకండి. ‘మాకు బట్టలు ఎట్లా?’ అనుకొంటూ మీ శరీరాన్ని గురించి బెంగ పెట్టుకోకండి. తిండికంటే జీవితం ప్రధానం గదా! బట్టలకంటే శరీరం ముఖ్యం గదా!...మీరు మొట్టమొదట దేవుని రాజ్యాన్ని, ఆయన నీతిన్యాయాలను వెదకండి. అప్పుడు వాటితోపాటు ఇవన్నీ మీకు చేకూరుతాయి” (మత్తయి 6:25,33).

ఒకరోజు ఒక వ్యక్తి యేసు దగ్గరికి వచ్చాడు. అతని కథ మూడు సువార్తల్లోనూ రాసివుందంటే, అదెంత ప్రాముఖ్యమో మనం గ్రహించాలి. అతని గురించి చాలా విషయాలు తెలుసు. అతను యువకుడు (మత్తయి 19:20). అతను అధికారి

(లూకా 18:18). అతను ధనవంతుడు (మార్కు 10:22). అతను చాలా భక్తిపరుడు (మార్కు 10:20). అంతటి ఐశ్వర్యం, అధికారం అతనికి వున్నప్పటికీ అతడు వినయశీలి, నడిరోడ్డులో, మట్టిలో అతను యేసు ఎదుట మోకరించాడు (మార్కు 10:17). తన సమస్యకు యేసు ఎటువంటి పరిష్కారమిస్తాడో వినాలని ఆసక్తితో పరుగుపరుగున వచ్చాడు. (మార్కు 10:17). అంతే గాక అతను ఆలోచనగలవాడు కూడా. ఇది మనకెలా తెలుసునంటే అతను

"శాశ్వత జీవం పొందడానికి నేను ఏ మంచి పని చేయాలి?" అని (మత్తయి 19:16) అత్యంత ప్రాముఖ్యమైన ప్రశ్నను అడిగాడు—

ఇతని గురించి మనం మరొక సంగతి అర్థం చేసుకోవచ్చు. ఇంత భక్తి జీవితం అనుసరించినా తాను శాశ్వత జీవం పొందాడని అతను అనుకో లేదు. యేసు అతన్ని చూచి, ప్రేమించాడని రాసి ఉంది (మార్కు 10:21). అతనికి ఉన్నతమైన మేలు చేయాలని యేసు ఆశించి ఇలా చెప్పారు.

"నీలో ఏ లోపమూ లేకుండా ఉండాలని ఆశిస్తే, వెళ్ళి నీకున్నదంతా అమ్మి బీదలకివ్వు. అప్పుడు పరలోకంలో నీకు ధనం ఉంటుంది. ఆ తరువాత వచ్చి నన్ను అనుసరించు" అని యేసు అతనికి బదులు చెప్పాడు. (మత్తయి 19:21).

దీన్ని బట్టి పరలోకంలో సంపద కూర్చుకోవటం ఎలాగో మనం తెలుసుకోవచ్చు (మత్తయి 6:19,20లో యేసు ఆదేశించిన ప్రకారంగా) "ఆగాగు, శాశ్వత జీవం పొందటానికి ఇదా పద్ధతి? మనం చేయాల్సిందల్లా యేసుని నమ్మటమే అని అనుకున్నానే?" అని ఎవరైనా ప్రశ్నించ వచ్చు. ధనవంతుడైన ఆ యువకుడు ఇలా చేయటం అవసరమని యేసు భావించినప్పుడు, దీనికి వ్యతిరేకంగా ఎవరైనా, ఏదైనా చెప్పగలరా? ఆయన దేవుని కుమారుడు. శాశ్వత జీవం ఇచ్చేది ఆయనే. శాశ్వత జీవం పొందాలంటే మనుషులు ఏమి చేయవలసివుందో ఆయనకు తెలుసు. వాస్తవమేమంటే, ఈ యువకుడి దృష్టిలో శాశ్వత జీవం కంటే, సత్యం కంటే ఎక్కువగా తన ఆస్తి ప్రియమైనది. పైగా అతను దేవున్ని ప్రేమించలేదు. ఆ స్థితిలో అలా అతను ఉన్నంత కాలమూ అతనికి శాశ్వత జీవం దక్కదు. ప్రేమార్హం కాని వాటిని ప్రేమించినందుకూ, దేవున్ని ప్రేమించనందుకూ అతను పశ్చాత్తాప పడవలసిన అవసరం ఉంది. పశ్చాతాపంతో కూడిన, విశ్వాసం ద్వారానే మనం శాశ్వత జీవం పొందగలిగేది.

యేసు దీనిని ఆ యువకునికి అతి కష్టంగానూ, మనకు అతి సులభంగానూ చేస్తాడా? యేసును సంపూర్తిగా అనుసరించకుండా మనల్ని ఆటంకపరిచే వాటన్నిటి విషయం మనమూ పశ్చాత్తాప పడాలి. ఆస్తులు, ఐశ్వర్యాల గురించి యేసు స్వయంగా చెప్పినదిదే—

"మీలో తనకున్నదంతా వదులుకోని వాడెవడైనా సరే నా శిష్యుడు కాలేడు" (లూకా 14:33). ఆయన మాటల్లోని భావం నిజంగా ఇదేనా? ఇది కాదేమో అనుకుంటూ మనం ఆయనను అవమానించరాదు. పదో వంతు ఇచ్చేయటం చాలదా? చాలదు. యేసు మన వంద శాతం హృదయాన్ని అడుగుతున్నాడు. జీవితం సాధారణ అవసరాలు – కూడు, గుడ్డ, నీడ – మనందరికీ కావాలి. మన మీద ఆధారపడిన వారిని మనం పోషించవలసిన అవసరం ఉంది (1 తిమోతి 5:8). అయితే యేసుకు మన ప్రేమ కావాలి. మనం నిజంగా దాన్ని ఆయనకు అందిస్తే, మనకున్నదంతా ఆయనకు ఇచ్చేస్తాం కూడా. అప్పుడు మనకేది అవసరమో దాన్ని ఆయన వాడుకోనిస్తాడు. మిగతాది ఆయన రాజ్యం కోసం ఉపయోగిస్తాడు. ఇలా ఆయన చేయవలసిందే. ఎందుకంటే ఆయన రారాజు. అపొస్తలుడు పౌలు చాలా స్పష్టంగా చెప్పాడు: "అందుచేత మనకు అన్నవస్త్రాలు ఉంటే వాటితోనే తృప్తిపడదాం." (1 తిమోతి 6:8).

యేసు తన శిష్యులకు చెప్పిన మరికొన్ని మాటలు:

"దరిద్రులారా, మీరు ధన్యులు" ఆయన అక్షరాలా పేదల గురించే చెప్పారని చూస్తున్నాం. ఎందుకంటే వారు ఆకలిగా ఉన్న పరిస్థితిని ఆయన ప్రస్తావించాడు. "అయ్యో ధనవంతులారా,

మీకు బాధ తప్పదు" అంటూ ఆయన వారి కడుపునిండిన స్థితిని వివరించాడు (లూకా 6:20,24). నేటి అనేక క్రైస్తవ నాయకుల బోధకూ, యేసు బోధకూ ఎంత వ్యత్యాసముందో గమనించండి.

ఇప్పుడు, ఒక వ్యక్తి యేసు శిష్యుడుగా మారినప్పుడు అతనికి అప్పటికే వున్న కొంత ఆస్తి, చక్కని ఇల్లు మొదలైన వాటిని ఏమి చేయాలి? అతను వాటినంతా ఇచ్చేయాలా? ఖచ్చితంగా అతను, వాటిని యేసుకు ఇచ్చేసి, ఆపై ఆయన ఆదేశించిన విధంగా చేయాలి. చాలామంది క్రైస్తవులు తమ ఖరీదైన గృహాలను అమ్మి మామూలు ఇళ్లలో ఉంటూ, ఆ అధిక ధనాన్ని దేవుని రాజ్యం కోసం ఉపయోగించవచ్చు. యేసు క్రీస్తు బోధల్ని చిత్తశుద్ధితో, పట్టుదలతో తీసుకోవాల్సిన సమయం వచ్చింది.

యేసును నమ్ముకునే సమయానికి కొంతమందికి వ్యాపారాలు ఉండి ఉండవచ్చు. అలాంటి వారు తమ వ్యాపారం ద్వారా ఆర్థికంగా వృద్ధి చెందాలని ప్రయత్నించకూడదా? అలా చేయడం యేసు సంకల్పం అయితే అలా చెయ్యాలి. వారు తమ శక్తి సామర్థ్యాల మేరకు డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించాలి. అయితే అది నిజాయితీగా చట్టబద్ధంగా ఉండాలి. ఆ ధనార్జన తమ కోసం కాదు గానీ దేవుని రాజ్యం

కోసమే.

యేసు మనందరికీ చెప్పే మాట ఇదే: మొట్టమొదట ఆయన రాజ్యాన్ని వెదకండి.

దేవునికి ఇవ్వడం గురించి అపొస్తలుడు పౌలు కొన్ని ప్రాముఖ్యమైన, ప్రయోజనకరమైన సంగతుల్ని 2 కొరింథీ 8వ అధ్యాయంలో రాశాడు.

యేసు ధనవంతుడై ఉన్నా మన కోసం దరిద్రుడు అయ్యాడు. (వ 9) ఆయన మనకు ఆదర్శం. శాశ్వత జీవం, ఐశ్వర్యాన్ని ఇతరులు పొందడంకోసం మనమూ పేదవారమయ్యేందుకు సంసిద్ధులుగా ఉండాలి.

కొందరికి ఏమీ లేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు మరి కొందరు విపరీతమైన సమృద్ధి అనుభవించకుండా ఉండటం కోసం సమానత ఉండాలని పౌలు కోరాడు (వ 13,14).

క్రీస్తు విశ్వాసులు ఆర్థికాభివృద్ధిని అనుభవించవచ్చని కూడా పౌలు తెలిపాడు – 2 కొరింథీ 9:8 చూడండి. అయితే గమనించండి ఈ అభివృద్ధి దాన్ని సంపాదించిన వ్యక్తి కోసం కాదు కానీ ఇతరులకు మేలు చేయడం కోసమే.

దీనంతటిలో ప్రతీ క్రైస్తవునికి పౌలు కూడా ఒక మాదిరే.

"అంతేకాదు, నా ప్రభువైన క్రీస్తు యేసును తెలుసుకోవడం

అనే అతి శ్రేష్ఠమైన ప్రయోజనం కోసం సమస్తాన్ని నష్టంగా ఎంచుకొంటున్నాను. క్రీస్తే నాకు లభించాలని అన్నిటినీ ఆయన కోసం నష్టపోయాను. వాటిని చెత్తతో సమానంగా ఎంచుకొంటున్నాను." (ఫిలిప్పీ 3:8 )

"చెత్త" కోసం జీవిస్తూ, దాన్ని ఇంకా ఇంకా సంపాదించుకోవాలని ప్రయత్నిస్తూ, పరలోక సంబంధమైన నిజమైన ఐశ్వర్యాల్ని అలక్ష్యం చేస్తూ ఈ రోజుల్లో ఎంతో మంది క్రైస్తవులు జీవించటం లేదా? ఈ అంశంపై పౌలు చేసిన బలమైన, వాస్తవిక వ్యాఖ్యల్ని 1 తిమోతి 6:9,10,17-19లో పరిశీలించండి.

ఈ కరపత్రం ప్రారంభంలోని ప్రశ్నలకు జవాబివ్వగలిగే స్థితిలో ఇప్పుడున్నాం. ఆ రెండు ప్రశ్నలకూ ఏకైక దృఢ సమాధానం – "వీల్లేదు".

ఆర్థికంగా సమృద్ధిచెందాలనే లక్ష్యం క్రీస్తు శిష్యులకు ఉండకూడదు.

యేసు నిజమైన అనుచరులకు మరింత ఉన్నతమైన లక్ష్యాలుండాలి. అవి ఎలా ఉండాలంటే, దేవుడు మనకిచ్చిన వాటితో ఆయన్ని మహిమపర్చాలి, మనం వర్థిల్లినా, వర్థిల్లకపోయినా ఆయన పని మాత్రం నిరాటంకంగా వర్థిల్లాలి, మన శాయశక్తులా ఇతరులకు, ప్రత్యేకంగా పేదలకు – సహాయం

చేయాలి. ఇందుకు మార్గం చాలా ఖరీదైన  కార్లలో తిరగడం, లేక ఆకర్షణీయమైన సూట్లు ధరించడం లేక, విలాసవంతమైన ఇళ్లలో నివసించడం మాత్రం కాదు.

మన దేశంలో  పెద్ద సమస్య  ఏమిటంటే  చాలామంది క్రైస్తవులు, అనేక బోధకులు సహా, లోక పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. ప్రభువైన యేసుక్రీస్తును అనుసరించడం గురించి పట్టించుకోవడం లేదు. ఆస్తులు, ఐశ్వర్యాలు, ధనం గురించి ఆయన చెప్పిన వాటిని ఆచరణలో పెట్టవలసిన సంగతిని లెక్క చేయుటం లేదు. మరి చివర్లో అత్యధికంగా నష్టపోయేది ఎవరు?



# ఒకే ఒక్క
# సత్య సంఘం

సంఘం అనే మాట "ఎక్లిషియా" అనే గ్రీకు మాట నుండి తర్జుమా అయ్యింది. అది ఏకవచనంగానో, బహువచనంగానో క్రొత్త నిబంధనలో 117 సార్లు వ్రాయబడింది. కానీ కేవలం

సువార్తల్లో 3 సార్లు మాత్రమే ఉంది, అది కూడా మత్తయి సువార్తలోనే! గ్రీకు మాటకు గల అక్షరార్థం, "వెలుపలికి పిలువబడినది" కానీ దీని భావం, కూడుకునేచోటు, మందిరంగా వాడుకలో ఉంది. క్రొత్త నిబంధన పరిభాషలో వ్యక్తిగతంగా వెలుపలికి పిలువబడి, దేవుని ఆరాధించే ఆయన ప్రజల సమూహం. ఈ పదం ఎన్నటికీ కట్టడానికి చెందినది కాదు.

మత్తయి 16:18లో సంఘము అని మొట్టమొదట ప్రస్తావించబడినప్పుడు యేసు అన్నారు "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును". నిజమైన సంఘం క్రీస్తుచేత కట్టబడింది, మనుష్యుల చేతకాదు. సంఘాలను కట్టండి అని బైబిల్‌లో ప్రత్యేకమైన సూచన ఏదీ లేదు. క్రీస్తు శిష్యులకు "సర్వలోకమునకు వెళ్లి శిష్యులనుగా చెయ్యండి" అని ఆజ్ఞాపించారు, వారికి క్రీస్తు బోధించిన వాటిని బోధించాలి. ఇది ఎప్పుడు జరుగుతుందో స్థానిక సంఘాలు లేస్తాయి, ఆ సంఘాలు శిష్యులను తయారుచేస్తాయి.

ఎప్పుడు యేసు ఈ బండ మీద నా సంఘమును కట్టుదును అన్నారో, అది ఏ ఒక్క వ్యక్తిని ఉద్దేశించి చెప్పిన మాట కాదు, అది పేతురును గురించి చెప్పిన మాట కూడా కాదు. ఈ బండ మీద అన్నప్పుడు ఆయన వాడిన పదం "పెట్రా", ఇది నపుంసకలింగానికి చెందిన పదం. పేతురు అనే మాట

"పెట్రాస్", అంటే చిన్నరాయి లేదా రాతిలో ఓ ముక్క. అయితే ఆయన సంఘమును కడతానని చెప్పినమాట పెద్దరాయి, బండ. మత్తయిని సువార్త వ్రాసేందుకు ప్రేరేపించిన దైవాత్మ, ఈ తేడాను చూపించటం జరిగింది. ఆయన రెండువమారు సైతం "పెట్రాస్" అనే మాటను (వినియోగించలేదు) వాడలేదు. అంటే ప్రభువు తన సంఘాన్ని పేతురుపై కడతానని అనలేదు. అలా అంటే గులకరాయి మీద ప్రపంచవ్యాపార సంస్థను కట్టినట్లు.

అటుతరువాత అపొ॥ పౌలు క్రైస్తవ జీవితానికి, పరిచర్యకు పునాది క్రీస్తే అని చెప్పాడు (1 కొరింథీ 3:11). అంతేకాదు సంఘాన్ని గురించి చెప్పినప్పుడు "క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయి అయి ఉండగా, ప్రవక్తలును, అపొస్తలులును వేసిన పునాది మీద" అన్నాడు. అయితే అపొస్తలులు, ప్రవక్తల వరుసలో పేతురున్నాడు, వీళ్లందరూ మూలరాయి అయిన క్రీస్తు ప్రభువు కంటే ఎంతో ఎంతో చిన్నవారు. పాత నిబంధనలో దేవుడే తరచూ "బండ" అని చెప్పాడు. మరియు 1 కొరింథీ 10:4లో క్రీస్తును "బండ" అని పిలవటం చూడొచ్చు. ("పెట్రా" అనే మత్తయి 16:18లోని మాటనే ఇక్కడ వాడటం జరిగింది).

పౌలు చెప్పిన ప్రవక్తలు, అపొస్తలులు అంటే దాని అర్థం వారి బోధ, వారి పరిచర్య అని. ఇందులో ఏ అనుమానం లేదు, ఇదే

ప్రభువు వారికి బోధించమని ఆజ్ఞాపించినది. అయితే ప్రభువు మార్గంలో పనిచేసిన అనేకమందిలో పేతురు ఒకరు.

సువార్తల్లో సంఘం అనే పదం క్రీస్తు ఉపయోగించారు. యోహాను 17వ అధ్యాయంలో గల ప్రార్థనలో సంఘాన్ని గురించిన కొన్ని గొప్ప సంగతులు చెప్పారు. ఇంతకు ముందు మీరు చదవకపోతే ఇప్పుడైనా చదవండి. 17వ అధ్యాయం గొప్ప అధ్యాయాలలో ఒకటి. ఒకవేళ ఇంతకు మునుపు చదివినా మరోసారి జ్ఞాపకాలను తాజా చేసుకునేందుకు చదవండి. యేసు తన కోసం ప్రార్థించారు (1-5వ॥), శిష్యుల కోసం ప్రార్థించారు (6-19వ॥), అటుతరువాత విశ్వాసముంచే మనందరి కొరకు ప్రార్థించారు (20,21వ॥), అప్పుడు ఉన్నవారి కొరకు, అప్పటి నుండి ఉండబోవు వారి కొరకు ప్రార్థించారు (22-26వ॥).

ఆ అధ్యాయంలో 6-8 వచనాల్లో, ఆయన తన యందు విశ్వాసముంచువారితో జరగబోవు విషయాలు సత్యమని చెప్పారు. వాళ్లు తండ్రి వలన కుమారునికి ఇవ్వబడిన ప్రత్యేక బహుమానం. ఆయన వాక్యము కలిగినవారు; తండ్రి వద్ద నుండి ప్రభువు వచ్చాడని వాళ్లు నమ్మారు గనుక, ఆయన వారికి చెప్పిన వాటన్నింటినీ వాళ్లు పొందారు.

14వ వచనంలో వారిని గురించిన తరువాతి సంగతులను

వివరించారు. "నేను లోకసంబంధిని కానట్లు వారునూ లోక సంబంధులు కారు గనుక లోకము వారిని ద్వేషించును". ఇంకోవిధంగా చెప్పాలంటే దేవుడు వారిని లోకంలోనుండి వెలుపలికి పిలిచారు (ఇప్పుడు విశ్వాసులు లోకానికి వేరుగా ఉన్నారు), ఇదే "ఎక్లిషియా" అనే మాటకు అర్థం. సంఘము, దేవుడు తన ప్రజలను లోకం నుండి వేరు చేశారు. నూతన జీవం, నూతన లక్ష్యాలు, నూతన యజమాని, ప్రభువు. వారు పరలోకం కొరకు చేయబడినవారు, లోకం కొరకు కాదు.

యేసు, తండ్రిని తన విశ్వాసుల భద్రత కొరకు (11,15వ॥) ప్రార్థించారు. యేసుప్రభువు ప్రార్థన ఎల్లప్పుడూ అంగీకరింపబడింది, ఆయన యందు విశ్వాసముంచిన వారు నిత్య భద్రత గలవారు.

సత్యము ద్వారా ప్రతిష్ఠించుమని కూడా యేసుప్రభువు ప్రార్థించారు (17వ॥). 19వ వచనంలో అదేమాటను తన నిమిత్తం కూడా ఉపయోగించారు, "నన్ను నేను ప్రతిష్ఠించుకొనుచున్నాను". ఇక్కడ ప్రతిష్ఠ అనేమాట (పవిత్రపర్చబడుట) పరిశుద్ధపర్చబడుట అని అర్థం కాదు. పాత క్రొత్త నిబంధనల్లో ప్రతిష్ఠ అనేమాటకు ప్రత్యేకించుట అని అర్థం. దీని అర్థం 'అంకితం' కావటం. తన యందు విశ్వాసముంచినవారు ప్రత్యేకపర్చబడి, అంకితం కావాలనేది

క్రీస్తు ప్రార్థన. దీని ఫలితంగా జరిగిన కార్యాలను అపొస్తలుల గ్రంథంలో మనం చూస్తాం. పెంతెకోస్తు దినాన మేడగదిలో వేచి ఉన్న శిష్యులపైకి పరిశుద్ధాత్మ దేవుడు దిగివచ్చాడు. దేవుని నూతన కార్యం భూమ్మీద ఆరంభమైంది (అపొ॥ 2:1–4).

యోహాను 17వ అధ్యాయంలో అప్పుడున్నవారు, అటుతరువాత ఉండబోవువారు, "ఏకముగా" ఉండాలని, ఆ ఏకత్వం తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ మధ్య గల ఏకత్వం (21, 23వ॥). తండ్రి కుమారుల మధ్య ఏకత్వం, ఆత్మ, జీవం, స్వభావాల మధ్య ఉన్నట్లే, విశ్వాసులు ఉండాలని, ఈ రోజుల్లో డినామినేషన్‌లన్నీ కలిసి ఏకంగా ఉండాలనే సంస్థాగత ఐక్యత కాదు.

యేసు ప్రార్థించిన ఈ ఐక్యతను ఏ మానవుడూ కలుగజేయలేడు. ఇది తండ్రియైన దేవుడు ఇప్పటికే చేసినది. యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి తిరిగి జన్మించిన వారందరు మొదటి శతాబ్దం నుండి ఇప్పటివరకు వారెక్కడ ఉన్నా, వారు స్థానికంగా ఏ సహవాసానికి హాజరైనా, వీళ్లంతా సజీవమైన ఐక్యతగలవారు. యేసు అందరూ సంఘముగా ఐక్యత కలిగి ఉండాలని ప్రార్థించారు, ఆయన ప్రార్థనలకు జవాబు వచ్చింది.

అపొస్తలుడైన పౌలు ఈ సత్యాన్ని స్పష్టంగా మనముందుంచాడు. 1 కొరింథీ 12:12,13లో

“అవయవములన్నియు అనేకములైయున్నను ఒక్క శరీరమైయున్నవో, అలాగే క్రీస్తు ఉన్నాడు.... మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మ యందే బాప్తిస్మము పొందితిమి”. “మనము” అనేమాట, పశ్చాత్తాపపడి క్రీస్తునందు విశ్వాసముంచిన వారందరు, నూతన జన్మానుభవము పొందినవారందరు, పరిశుద్ధాత్ముడు తమలో నివసిస్తున్న వారందరికి చెందినది. ఎవరు దైవాత్మ గలవారో వారు ఆయనవారు, దైవాత్మ లేనివారు ఆయన వారు కారు. (ఒకవేళ వాళ్లు ఏ స్థానిక సంఘానికి చెందినవారైనా, తిరిగి జన్మించిన వారే దైవాత్మ నివాసం). అట్టివారే సత్య సంఘం. ఒకే సంఘం, వారే క్రీస్తు శరీరం. నిజ విశ్వాసుల్లో దైవాత్మ నివసిస్తాడు.

ఎఫెసీ పత్రికలో తిరిగి పౌలు సంఘాన్ని గురించి వ్రాశాడు. అతను మాట్లాడుతూ “సమస్తమును ఆయన పాదాల క్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది” (ఎఫెసీ 1:22,23). పౌలు ఇంకా మాట్లాడుతూ (చెబుతూ) సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగినవారై.... ఒకనినొకడు సహించుచు.... నడుచుకొనవలెనని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. శరీరము ఒక్కటే, ఆత్మయు

ఒక్కడే" (ఎఫెసీ 4:1–4). క్రీస్తునకు అనేక శరీరాలు లేవు. ప్రతి స్థానిక సంఘంలోని నిజవిశ్వాసులందరూ ఆ శరీరంలోని సభ్యులే ఒకే శరీరం. ఆయన సంఘమనే శరీరంలో ఐక్యతను ఆత్మ కలిగించాడు. అది ఇంతకు పూర్వమే ఉన్నది. మనుష్యులు దీనిని కలుగజేయలేరు, ప్రయత్నించటం కాదు. ఉన్న ఐక్యతను సమాధానమను బంధము చేత కాపాడుకోవాలి. మనకు తెలుసు వారు ఎల్లప్పుడూ దీనిని చెయ్యరు. అయ్యో! అందరిలో దేవుని ప్రజలలో తరచూ విభజనలు, ఉద్దేశాలు విషయాలు విభజనకు కారణం కాకూడదు. సమాధాన బంధానికి బదులు కలహాలు, కొట్లాటలు (1 కొరింథీ 3:3,4 చూడండి). ఇతర సభ్యులతో సంఘంలో ఏకత్వం కలిగి (జీవించటం) ఉండటం, క్రీస్తు శరీరం ఒక్కటేననే ఐక్యతను (ప్రతిఫలిస్తుంది) చూపుతుంది. అతడు, ఆమె ఇందుకు ప్రయత్నించటం లేదు, ఇది వారి బాధ్యత. వ్యక్తులుగా విశ్వాసులు, సంఘాలు ప్రయత్నించినా, ప్రయత్నించకపోయినా క్రీస్తు శరీరం ఐక్యం గలది. నిజ ఐక్యత నిలిచి ఉంటుంది.

నిజ విశ్వాసులు పరిశుద్ధాత్మను కలిగి ఉన్నవారు. యేసుక్రీస్తును ప్రేమించేవారు సైతం కొన్ని విషయాలలో ఏకీభవించకపోవచ్చు. అందరం ఒకే విధంగా చూడలేం. దేవుని వాక్యాన్ని అందరం ఒకే విధంగా అర్థం చేసుకోలేం. ఇట్టి బేధాభిప్రాయాలు వచ్చినప్పుడు ప్రేమ, దయ గలవారై ఉండాలి.

మనమంతా విశ్వాసము, క్రీస్తుయేసును గూర్చిన జ్ఞానం విషయాల్లో సంపూర్ణతవైపు సాగివెళుతున్నాం (ఎఫెసీ 4:13 చూడండి).

అందుచేత బైబిల్ యొక్క స్పష్టమైన బోధ ఇది :

ప్రపంచ వ్యాప్తంగా క్రీస్తుయేసు శరీరమైన సంఘం ఒక్కటే! ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించి, తిరిగి జన్మించి, దైవాత్మ గల వారందరూ ఒకే సత్య సంఘానికి చెందినవారు. వేరేవారెవ్వరూ అందులో ఉండరు. ఈ సంఘంలో కాక మరి వేరే దానికి చెందినవారైనా, అది వారికి రక్షణ విషయంలో ఏ మేలు చెయ్యదు.

ప్రతి స్థానిక సంఘం క్రీస్తుయేసు శరీరం యొక్క సూక్ష్మ (సంక్షిప్త) రూపం. ఆయన నడిపించినట్లు, నాయకులు నడిపించటం; ఆయన దేవుని ఎలా సేవించాలని ఆశిస్తారో అలా సేవించటం. ఆయన శిరసత్వానికి అన్ని విషయాలలో అప్పగించుకోవటం. శరీరంలో ఆత్మ యొక్క ఐక్యతను గుర్తించటం. సమాధాన బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకోవటం అందరూ చెయ్యాలి.

ఒక్కటే కేవలం ఒక్కటే నిజ సంఘం, యేసు దేహం. బాప్తిస్మమో, నిర్ధారణో లేదా సంఘం యొక్క ఏవిధమైన ఆచారమో, శాసనమో లేదా ఏవిధమైన కార్యకలాపాలో కాదు.

ఒకే మార్గం నిజ పశ్చాత్తాపం, యేసుక్రీస్తు నందు సజీవమైన విశ్వాసం, హృదయంలోనికి ఆయనను చేర్చుకోవటం. ఇదంతా కృప ద్వారానే! ఇది దేవుని వరం (ఎఫెసీ 2:8,9; తీతు 3:3-5 చూడండి). పరిశుద్ధాత్మ దేవుడే నిజ సంఘంలోనికి తీసుకునివస్తాడు. ఆయనే చేయకపోతే ఏ మనుష్యుడు దానిని పొందనేరడు.

నువ్వు యేసు దేహమైన ఆ నిజ సంఘంలో ఉన్నావా? లేకపోతే యేసుక్రీస్తును నీ ప్రభువుగాను, సొంత రక్షకునిగాను స్వీకరించు. అందులోంచి ప్రవహించే అద్భుతమైన ఆశీర్వాదాన్ని అనుభవించటం ఆరంభించు.



# మహా
# శ్రమలు

నూతన నిబంధనలో శ్రమలు అనే పదం గ్రీకు "థలిప్సిస్" అనే పదం నుండి తర్జుమా చేయబడింది.  ఇది 45సార్లు ఉపయోగించబడింది.  కింగ్ జేమ్స్ ఇంగ్లీషు తర్జుమాలో

"శ్రమలు", "ఇబ్బంది", "బాధలు", "బాధించబడుట", "హింసించబడుట", "వేదన", "భారము మోపిరి" అనే ఏడు విధాలైన పదాలను వాడారు. ఇదంతా మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురి చేయుట అని సాధారణంగా చెప్పుకోవచ్చు.

దేవుని ప్రజలు వీటన్నింటినీ ఎదుర్కొంటారు. ఈ శ్రమలు, వారు ఆయనకు చెందినవారగుటవలననే సంభవిస్తాయి. చిన్న విషయానికే హేళన చేయబడటం, ముఖ్యంగా యవ్వనస్థులైన విశ్వాసులు, తక్కువచేయబడి బాధ అనుభవిస్తారు. లేదా ఈ హింస మరణానికీ దారి తీస్తుంది. మన ఈ రోజుల్లో ప్రపంచంలో అనేకచోట్ల ఇవి జరుగుతున్నాయి. లేదా తీవ్రమనస్థాపం, బాధ, వేదనల మధ్య అనేక రకాలుగా విశ్వాసానికి పరీక్షలు ఏర్పడుతున్నాయి. ఇది శారీరక హాని లేదా ఆర్థిక ఒత్తిడి కలిగించే ప్రమాదం. ప్రభువు నందు విశ్వాసం ఉంచినందువలన, వారి స్నేహితులచేతనే నిరాకరించబడటం, వివక్షతకు గురి కావటం ఎంతో బాధను కలిగిస్తుంది. అన్ని ఇబ్బందులతోపాటు క్రీస్తు ప్రజలు శ్రమల గుండా వెళ్లవలసిందేనని, లోకము, పతనమైన మానవుడూ మిమ్మును ద్వేషిస్తారని యేసు చెప్పారు (యోహాను 15:19). అపవాది కూడా వీరిని ద్వేషించటం మూలంగా అత్యధికమైన

శ్రమలు, వాడెంత కలుగజేయగలడో అంతా, ఇందుకు మరో కారణం.

అమెరికా వంటి దేశాల్లో పైన చెప్పబడినవి కానరావు. కానీ నేను అనేక సంవత్సరాలు దేవుని సేవించిన దేశంలో ఇవి తరచూ జరుగుతూనే ఉన్నాయి; ఆ దేశం ఇండియా! ఇండియాలో జరిగినట్లు అనేక దేశాల్లో హింసలు చాలా హెచ్చుగా జరుగుతూనే ఉన్నాయి. యేసు తన ప్రజలకు శ్రమలను గురించి ఏం చెప్పారో చూద్దాం.

"జనులు మిమ్మును నిందించి హింసించి....నప్పుడు మీరు ధన్యులు. సంతోషించి, ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును" (మత్తయి 6:11,12).

"జనులు మిమ్మును శ్రమలపాలుచేసి చంపెదరు" (మత్తయి 24:9).

"లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాననెను" (యోహాను 16:33).

మనం అపొస్తలుల కార్యాలను చదివినప్పుడు ఆది సంఘంలో ఇవన్నీ ఎలా నెరవేరాయో చూస్తాం. అక్కడ మనకు పౌలు, బర్నబాల మాటలు కనిపిస్తాయి. "అనేక

శ్రమలను అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెను" (అపొ॥ 14:22).

ఇదిగో పౌలు శ్రమలను గురించి చేసిన బోధ ఇక్కడుంది.

"శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలయందును అతిశయపడుదుము" (రోమా 5:3,4). "క్రీస్తుతో కూడా మహిమపొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల క్రీస్తుతోడి వారసులము" (రోమా 8:17). "క్షణమాత్రముండు మా చులకని శ్రమ మా కొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగజేయుచున్నది" (2 కొరింథీ 4:18). "మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమల యందు సంతోషించుచు...." (కొలస్సీ 1:24).

పేతురు శ్రమలను గురించి ఇక్కడ ఏం చెబుతున్నాడో చూడండి.

"ఇందుకు మీరు పిలువబడితిరి, క్రీస్తు కూడా మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడల యందు నడచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను" (1 పేతురు 2:21). "క్రీస్తు శరీరమందు శ్రమపడెను గనుక మీరును అట్టి మనస్సును ఆయుధముగా ధరించుకొనుడి" (1 పేతురు

4:1). “ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహా శ్రమలను గూర్చి మీకేదో యొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి... క్రీస్తు శ్రమలలో మీరు పాలివారైయున్నంతగా సంతోషించుడి” (1 పేతురు 4:12,13).

బైబిల్ చదివిన వారెవ్వరికైనా, దేవుని ప్రజల చరిత్ర అంతా శ్రమలమయం అని గ్రహిస్తారు. పాత నిబంధనలో యోబు, దావీదు, దేవుని ప్రవక్తలు, పేరు తెలియని ఎందరో పరిచారకులు దేవుని కోసం శ్రమలను పొందారు. “మరికొందరు తిరస్కారములను, కొరడా దెబ్బలను, మరి బంధకములను ఖైదును అనుభవించిరి. రాళ్లతో కొట్టబడిరి, రంపములతో కోయబడిరి, శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి....” (హెబ్రీ 11:36,37).

క్రొత్త నిబంధనలో యేసు చెప్పినట్లే, వెనువెంట జరుగుతూనే వచ్చాయి. దేవుని సేవకులు ఎదిరించబడ్డారు, చెదిరింపబడ్డారు, హాని పొందారు, చెరసాల పాలయ్యారు, చంపబడ్డారు.

బైబిల్ లో దేవుని పిల్లల శ్రమలను గురించిన బోధ ఇదిగో...!

1. శ్రమలు, ఇబ్బంది, ఒత్తిడి అనేవి క్రీస్తు నందు

విశ్వాసముంచిన నిజ క్రైస్తవులకు సహజం. ఏ తోటలో సువాసనలిచ్చే పుష్పాలు ఎదుగుతాయో, అదే వాతావరణంలో దృఢమైన మొక్కలు మొలుస్తాయి.

2. విశ్వాసానికి కలిగే శ్రమలు గొప్ప ఫలితాన్ని ఇస్తాయి. అందులో సంతోషించటం, అందులో మహిమపర్చటం (1 పేతురు 1:7; 4:12,13; రోమా 5:3,4). శ్రమలనేవి ఓర్పును కలుగజేసి, విశ్వాసాన్ని దేవుని దృష్టిలో ప్రశస్థమైన దానిగా చేసేందుకు ఆయన వినియోగించే పద్ధతి. ఎవరిని ఆయన చెప్పుకోదగిన విధంగా ఆశీర్వదించాలని అనుకుంటాడో, అట్టివారికి గొప్ప శ్రమలను అనుమతిస్తాడు.

3. శ్రమలను సహించటం అనేది గొప్ప మహిమకు మూలం. యాకోబు, విరగ్గొట్టబడి రాకుమారుడయ్యాడు. యోసేపు నిరాకరించబడి, శ్రమలను అనుభవించి క్రీస్తు ప్రభువునకు సౌందర్యవంతమైన ముంగుర్తు అయ్యాడు. యోబు మంటిలో పడద్రోయబడి, అపవాది నోరు మూయించటానికి దేవునిచేతి సాధనమయ్యాడు. పౌలు శ్రమలు "సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తుపడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (కొలస్సీ 1:24).

బైబిల్ ప్రకారం– ఇది కేవలం మనకు శ్రమలను గురించి అవసరమైన సమాచారం యొక్క మూలం, ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రమలను తప్పించుకోవటం నిరాశపడటం కుదరదు. ఇది లోకం యొక్క నైజం. శ్రమలు, ఇబ్బందులనేవి, అగ్నిలో మనకు దేవుని మహిమపర్చే గొప్ప అవకాశాన్ని కలిగిస్తాయి. తుఫానులో దేవుడు తన ప్రజల కొరకు ఏం చెయ్యగలడో ఇది బయల్పరుస్తుంది.

4. క్రీస్తు రాకడలో ఇట్టి శ్రమలను సహించటం అనేది ఘనతకు, మహిమకు, స్తుతికి కారణమౌతుంది. నేటి శ్రమకు రేపటి మహిమకు సన్నిహిత సంబంధం ఉందని అంటాం. తరచూ మనం (మర్చిపోతాం) ఆ గ్రహింపు కలిగి ఉండము (మత్తయి 5:10–12; 2 కొరింథీ 4:17; 1 పేతురు 4:13). ఇక్కడ క్రీస్తు కొరకు శ్రమలను అనుభవించటం అక్కడ ఘనతకు కారణమౌతుంది. ఈ బహుమానాలను (ఘనతలను) కోల్పోదామా?

5. క్రీస్తు కొరకు హింసలను అనుభవించటం, మనం ధన్యులం అనేందుకు, మహిమ గల ఆత్మ మనపై నిలిచి ఉన్నాడనేందుకు గుర్తు (1 పేతురు 4:14).

6. క్రీస్తుతో శ్రమపడటం, ఆయన విశ్వాసులకు భూమ్మీద

గొప్ప ఆధిక్యత. ఆయనకు చెందిన మనం ఆయన దేహంలో అవయవాలం, అవయవాలు శ్రమపొందితే, శిరస్సు కూడా శ్రమ పొందుతుంది. అపొ॥ కార్యాలు 9:41; యెషయా 63:9; రోమా 8:17; కొలస్సీ 1:24 చూడండి.

ఎంతో గొప్ప మహిమకరమైన సంఘ చరిత్రలో దేవుని ప్రజలు శ్రమల మధ్య బాధను అధిగమించి నిలబడటం, హింస, మరణాల యెద్ద జయోత్సాహం చేశారని నమోదు చెయ్యబడింది. అది దేవునికెంత మహిమగా ఉందో, ఉంటుందో! ఈ శ్రమల చరిత్ర ముగిసిందని అనుకోకు! మహిమకరమైన పేజీలు ఇంకా రాయబడవలసి ఉంది.

శ్రమల నుండి తప్పించుకోవాలనే ఆతృత, పౌలులో కనిపించదు. "మనము శ్రమల యందు దేవుని మహిమపరచుదము"; లేదా మోషే "దేవుని ప్రజలతో శ్రమలననుభవించుట" (హెబ్రీ 11:25); లేదా శిష్యులను చూడండి, దెబ్బలు తిన్నప్పుడు సంతోషించారు. "ఆ నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులమని యెంచబడినందున వారు సంతోషించుచు" (అపొ॥ 5:41). వీరిలో ఎవ్వరూ శ్రమలను తప్పించుకోవటం భాగ్యం అనుకోలేదు. పరిశుద్ధ జీవితం సంఘం యొక్క సహజ హక్కు.

పశ్చిమ దేశాలలో క్రైస్తవ్యంలో ఈ విషయం కనిపించక పోవటం చూచి, ఎ.డబ్ల్యూ.ట్రోజర్ "ఎట్టి అనుమానం లేదు, ఈ తరం ఉన్న ఆత్మీయ ఎత్తులను చేరుకోలేని సున్నితత్వం కలిగి ఉంది. రక్షణ అనేది వారికి ఏ అర్థాన్ని ఇచ్చిందంటే, అసౌకర్యమైన వాటి నుండి విడుదల పొందటం. మన పాటలు, ప్రసంగాలు, ఒక ఆదరణ, ఆహ్లాదాలు గల మతాన్ని మన కొరకు తయారుచేశాయి. మనం సిలువను, రక్తాన్ని, ముళ్లు గల స్థలాన్ని నిర్లక్ష్యం చేశాం". ఆహ్లాదకరంగా ఉండటం, శ్రమలను తప్పించుకోవటం, అమెరికా చర్చిలో తరచూ మనం వినే వర్తమానం.

మనకు తెలుసు ఎట్టి శ్రమలు మనకు వచ్చినా, శక్తివంతుడైన యేసుక్రీస్తు ప్రేమగలవాడు వాటన్నింటిలో మనతో ఉంటాడు. ఆయన ప్రేమ నుండి ఏదీ మనలను ఎడబాపదు.

సాతానుడు, లోకం దేవుని పిల్లలకు విరోధంగా ఈ భూమ్మీద ఎక్కడో ఒకచోట కీడును కలుగజేస్తూనే ఉన్నారు. రేపు అదే పరిస్థితి నీకు, నీ ప్రాంతానికి సంభవించవచ్చు. అప్పుడు దేవుని ప్రేమ విడిచిపెడుతుందా? ప్రభువు మనకు దూరంగా ఉంటాడా?

క్రీస్తు కొరకు శ్రమలను అనుభవించటం మాత్రమే కాదు

మరణించటం కూడా భాగ్యమే కదా? శ్రమలు ఏ రోజైనా నీదాకా రావచ్చు. ప్రార్థనాపూర్వకంగా సిద్ధంగా ఉండు. అదే నాకు సంభవిస్తే, చెరసాలలో ఉండి అర్థరాత్రివేళ కీర్తనల వెంట కీర్తనలు పాడి, ఆనందించిన అపొస్తలులవలె నేనుండాలని కోరుకుంటున్నాను.